# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | శుక్రవారం 28-5-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 249 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# సీఎం కేసీఆర్‌కు ఆటో డ్రైవర్ల కృతజ్ఞతలు



హైదరాబాద్ , మే 27: ఆటో డ్రైవర్లను ప్రజాసేవకులుగా గుర్తించి కరోనా వ్యాక్సిన్ ఇస్తున్నందున ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలంగాణ రాష్ట్ర ఆటో కార్మికుల పక్షాన రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతూ ఓ వినతిపత్రం అందించారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య శ్రీ పథకాలను ఆటో డ్రైవర్లకు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. కరోనా లాక్‌డౌన్ కారణంగా కుటుంబ పోషణ భారంగా మారిందని, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం కింద నెలకు రూ. 10 వేలు ఇవ్వాలని కోరారు. కరోనాకు ఆటో డ్రైవర్లు బలయ్యారని, ఆ కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించాలని కోరారు.

## భారతీయ ఐటీ చట్టాలకు కట్టుబడి ఉన్నాం : గూగుల్ సీఈవో

న్యూఢిల్లీ, మే 27: భారత ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త ఐటీ చట్టాలకు లోబడే తాము పనిచేయనున్నట్లు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ తెలిపారు. సోషల్ మీడియా నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం బుధవారం నుంచి కొత్త ఆంక్షలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. స్థానిక చట్టాలకు తమ కంపెనీ కట్టుబడి ఉంటుందని, ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలకు అనుగుణంగా తాము సేవలు అందించనున్నట్లు సీఈవో పిచాయ్ తెలిపారు. కొత్త ఐటీ నిబంధనలు ఇప్పుడిప్పుడే అమలులోకి వచ్చాయని, లోకల్ టీమ్స్ వాటి గురించి విశ్లేషిస్తున్నారని, తమ సేవలు ఉన్న అన్ని దేశాల్లోనూ స్థానిక చట్టాలను గౌరవిస్తామని, వారితో కలిసి పనిచేస్తామని, తమ నివేదికలన్నీ పారదర్శకంగా ఉన్నాయని సుందర్ పిచాయ్ చెప్పారు.ఫ్రీ, ఓపెన్ ఇంటర్నెట్ వ్యవస్థీకృత మైందని, భారత్‌లో ఆ సాంప్రదాయం ముందు నుంచే ఉందన్నారు. రాజ్యాంగ విధానాలను తమ కంపెనీ గౌరవిస్తుందని, అవసరమైన చోట వెనక్కి తగ్గినట్లు కూడా ఆయన తెలిపారు. టెక్నాలజీతో ప్రపంచ రూపురేఖలు మారిపోయాయని, సాంకేతిక పరిజ్ఞానం సమాజాన్ని మార్చేసిందన్నారు. యూరోప్‌లో కాపీరైట్ ఆదేశాలు ఉన్నాయని, భారత్‌లో సమాచార నియంత్రణ ఉందని, ఇలా వివిధ దేశాల్లో ఉన్న సమస్యలను పరిగణించి తాము ముందుకు వెళ్తున్నట్లు సుందర్ పిచాయ్ తెలిపారు. ఫేస్‌బుక్, వా ట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టా, గూగుల్ లాంటి సోషల్ మీడియా కంపెనీల వినియోగం ఇటీవల పెరిగింది. వాటిపై వస్తున్న కాంటెంట్‌కు వాటినే బాధ్యుల్ని చేసే విధంగా ఇటీవల ప్రభుత్వం కొత్త ఐటీ రూల్స్‌ను తీసుకువచ్చింది.

## వ్యాక్సినేషన్‌తోనే ఎకనామీపై మహమ్మారి ఎఫెక్ట్‌కు చెక్ : ఆర్బీఐ

న్యూఢిల్లీ, మే 27: కరోనా మహమ్మారి ఫస్ట్ వేవ్ తో పోలిస్తే ఆర్థిక వ్యవస్థపై సెకండ్ వేవ్ ప్రభావం తీవ్రంగా లేదని ఆర్బీఐ వార్షిక నివేదిక పేర్కొంది. వ్యాక్సినేషన్ ను ముమ్మరంగా చేపడితే ఎకానమీపై మహమ్మారి నష్టాన్ని నియంత్రించవచ్చని ఆశాభావం వ్యక్తం చేసింది. ఆర్థిక వ్యవస్థ రికవరీ కొనసాగించేందుకు ప్రైవేట్ డిమాండ్ పెరగడంతో పాటు వినిమయం ఊపందు కోవాలని పేర్కొంది. ఫస్ట్ వేవ్ లో వైమానిక, టూరిజం, ఆతిథ్య రంగాలు దారుణంగా దెబ్బతిన్నాయని దీంతో సేవా రంగం కుదేలైందని పేర్కొంది.మహమ్మారి విలయం నుంచి ఆర్థిక వ్యవస్థ బయటపడాలంటే వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేసింది. సెకండ్ వేవ్ వ్యాప్తిని ఎంత త్వరగా మనం అధిగమిస్తామనే దానిపై దేశ వృద్ధి ఆధారపడి ఉందని పేర్కొంది. పలు రంగాల్లో చేపట్టిన సంస్కరణలు భారత వృద్ధి సామర్థ్యానికి ఊతమిస్తాయని ఆర్బీఐ వార్షిక నివేదిక వివరించింది. ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగిస్తూ వ్యవస్థలో ద్రవ్య లభ్యత పెరిగేలా చర్యలు చేపడతామని పేర్కొంది.

# మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసిన వీసీలు

హైదరాబాద్ , మే 27: విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సీతారామా రావు, తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి రవీందర్ గుప్తా మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవలే నూతన వీసీలుగా నియమితులైన సందర్భంగా వారు గురువారం మంత్రితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సబితా రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తూ తెలంగాణలోని విశ్వ విద్యాలయాలను మరింత ఉన్నతి స్థితికి తీసుకెళ్లాలన్నారు.

## హనుమంతుని జన్మస్థలంపై అసంపూర్తిగా ముగిసిన చర్చ

తిరుమల, మే 27: : హనుమంతుని జన్మస్థలంపై జరిగిన చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. తిరుపతి సంస్కృత విద్యాపీఠంలో టీటీడీకి, హనుమాన్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు మధ్య చర్చ జరిగింది. గురువారం జరిగిన చర్చలో టిడిపి సాంస్కృతిక విద్యాపీఠం వీసీ మురళీధర్ శర్మ, టీటీడీ ప్రత్యేక కార్య నిర్వహణాధికారి ధర్మారెడ్డి, హనుమాన్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు తరఫున గోవిందానంద స్వామి పాల్గొన్నారు. టీటీడీ ఆధారాల్లో తప్పులు ఉన్నాయని స్వామి గోవిందానంద సరస్వతి అన్నారు. టీటీడీ పూర్తి నివేదిక అందిస్తే తప్పులు చూపిస్తానని పేర్కొన్నారు. స్వామీజీకి నివేదిక ఇవ్వడానికి టీటీడీ నిరాకరించింది. అంజనాదేవి తిరుమలలోనే హనుమంతుడికి జన్మనిచ్చిందనేది టిటిడి వాదన. కాదు హనుమంతుడు కిష్కింధలోనే జన్మించాడని గోవిందానంద స్వామిజీ వాదన. పూర్తి నివేదిక ఇస్తేనే మాట్లాడతానని గోవిందానంద స్వామిజీ పట్టుబట్టడంతో చర్చ అసంపూర్తిగా ముగిసింది.గత ఏప్రిల్ 13న ఉగాది సందర్భంగా టీటీడీ తిరుమలలోని అంజనాద్రి హనుమంతుడి జన్మస్థలమని ప్రకటించింది. శ్రీ వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సన్నిధానం సుదర్శన శర్మ నేతృత్వంలోని ఎనిమిది మంది సభ్యుల నిపుణుల కమిటీ 2020 డిసెంబర్ లో ఇచ్చిన నివేదిక ఆధాంగా ఆ ప్రకటన వెలువడింది. అనేకసార్లు సమావేసమైన కమిటీ ప్రాచీన గ్రంథాల నుంచి సేకరించిన ఆధారాలతో నివేదికను రూపొందించి టీటీడీకి సమర్పించింది. కర్నాటకలోని శ్రీ హనుమద్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు మే నెల మొదటివారంలో టీటీడీ వాదనను ప్రశ్నిస్తూ ఆరు పేజీల లేఖను రాసింది. కమిటీ నివేదిక భక్తులను తప్పుదారి పట్టించేదిగా ఉందని పేర్కొన్నది. కర్నాటకలోని? కొప్పల్‌లో కిష్కింధ పర్వతాల్లో హనుమంతుడు జన్మించినట్లు తన దగ్గర ఆధారాలు ఉన్నాయని ట్రస్టు స్పష్టం చేసింది. ఎ

# చోక్సీని భారత్ పంపండి: అంటిగ్వా ప్రధాని

న్యూఢిల్లీ, మే 27: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణం కేసులో నిందితుడు మెహుల్ చోక్సీని డొమినికా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్యూబాకు పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా.. అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయనపై లుకౌట్ నోటీస్ జారీచేయడంతో డొమినికా పోలీసులు పట్టుకుని తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఆంటిగ్వా అధికారులకు అప్పగించే ప్రక్రియ కొనసాగుతోందని, ఈ మేరకు సీబీఐ, ఈడీకి సమాచారం ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత్, అంటిగ్వాకు డొమినికా ప్రభుత్వం సహకరిస్తుందని అంటిగ్వా ప్రధాని తెలిపారు. డొమినికాలోకి చోక్సీ అక్రమంగా ప్రవేశించారని, ఆయనను భారత్ కు పంపాలని అంటిగ్వా ప్రధాని గాస్టన్ బ్రౌన్ కోరారు.

భారతదేశం డొమినికాతో మంచి సంబంధాలను కలిగి ఉందని హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రభుత్వం ఇటీవల "వ్యాక్సిన్ మైత్రి" చొరవలో భాగంగా కరేబియన్ ద్వీపానికి లక్ష కోవిడ్ వ్యాక్సిన్లను ఉచితంగా పంపించిందని పేర్కొంది. ఈ నెల 24న రాత్రి డిన్నర్‌కు వెళ్లిన చోక్సీ.. ఆ తర్వాత కనిపించకుండా పోయారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో అంటిగ్వా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆయన వాహనాన్ని రెస్టారెంట్ సమీపంలోని జాలీ హార్బర్‌లో గుర్తించారు.

పీఎన్‌బీ కుంభకోణం కేసులో నిందితుడైన మెహుల్ చోక్సీని దేశానికి తీసుకువచ్చేందుకు సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రయత్నాలు చేస్తున్నాయి. చోక్సీ 2017లో అంటిగ్వా, బార్బుడా పౌరసత్వం తీసుకున్నారు. అయితే, 2018లో పీఎన్‌బీ కుంభకోణం బయటపడడంతో నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ దేశం విడిచి పరారయ్యాడు. నీరవ్ మోదీకి మెహుల్ చోక్సీ మేనమామ అవుతారు. నీరవ్ ప్రస్తుతం బ్రిటన్ జైల్లో ఉన్నారు. మెహుల్ చోక్సీ కోసం సీబీఐ, ఈడీలు గాలిస్తున్నాయి. మొత్తం రూ.13,578 కోట్ల పీఎన్‌బీ కుంభకోణం కేసులో చోక్సీ రూ.7,080 కోట్లు మేర అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కుంభకోణం బయటపడటానికి నెల రోజుల ముందే 2018 జనవరి 4 అంటిగ్వాకు వెళ్లారు. చోక్సీ కేవలం భారతీయ బ్యాంకులనే కాదు, దుబాయ్, అమెరికాలకు చెందిన వ్యాపారులు, కస్టమర్లను మోసం చేసినట్టు ఈడీ ఛార్జ్ షీట్‌లో తెలిపింది. అయితే, తనపై ఉన్న కేసులు రాజకీయ కుట్రల ఫలితమేనని, భారతదేశంలో అతని ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చట్టవిరుద్ధంగా అటాచ్ చేసిందని మెహుల్ చోక్సీ ఆరోపించారు.

# ఆనందయ్య మందు పరిశోధన- పురోగతిపై ఉపరాష్ట్రపతి ఆరా

నెల్లూరు,మే 27: నెల్లూరు జిల్లాకు చెందిన ఆనందయ్య నాటు మందుపై పరిశోధన పురోగతి గురించి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆరా తీశారు. కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి శ్రీ కిరణ్ రిజిజుకు ఫోన్ చేశారు. పరిశోధన పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రాలయ పరిధిలో ఉన్న సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ (సీసీఆర్ఏఎస్) ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ ఆయుష్ విభాగం వారి సహకారంతో ఆనందయ్య మందును ఇప్పటికే వాడిన 500 మంది నుంచి వివరాలు సేకరించి, పరిశోధన జరుపుతున్నామని, వీలైనంత త్వరలోనే పరిశోధన పూర్తి చేసి నివేదికను సిద్ధం చేస్తామని ఉపరాష్ట్రపతికి వివరించారు.

జనబాహుళ్యానికి చెందిన అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశం కాబట్టి, ఎటువంటి వివాదాలకు తావు లేకుండా అన్ని కోణాల నుంచి పరిశోధన చేయవలసి ఉంటుందని అందువల్ల కాస్త సమయం పడుతోందని తెలిపారు. విషయంపై రాజీ పడకుండా, వీలైనంత త్వరగా పరిశోధనను పూర్తి చేస్తామని ఉపరాష్ట్రపతికి కేంద్ర మంత్రి తెలిపారు.

అనంతరం ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ ప్రొ. బలరాం భార్గవ్ తోనూ ఉపరాష్ట్రపతి ఫోన్ ద్వారా మాట్లాడారు. ఈ మందు ఆయుష్ విభాగ పరిధిలోనిది గనుక, ఇప్పటికే ఆయుష్ వారి పరిశోధన ప్రారంభమై, కొనసాగుతున్న నేపథ్యంలో మళ్లీ అదనంగా ఐసీఎంఆర్ విచారణ అవసరం లేదని ఆయన ఉపరాష్ట్రపతికి తెలియజేశారు.

## ప్రొఫెసర్ రవీందర్ గుప్తాకు కోలేటి దామోదర్ అభినందనలు

హైదరాబాద్ , మే 27: నిజామాబాద్‌లోని తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా నియమితులైన ప్రొఫెసర్ డి.రవీందర్ గుప్త కు తెలంగాణ రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ కోలేటి దామోదర్ అభినందనలు తెలిపారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ.. ఒక విశ్వవిద్యాలయానికి వీసీగా వైశ్య వర్గానికి చెందిన వ్యక్తిని నియమించడం అరుదైన సంఘటన అన్నారు.తెలంగాణ ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ వైశ్య వర్గానికి సముచిత స్థానం కల్పించారన్నారు. సీఎం కేసీఆర్ ఆదర్శాలకు అనుగుణంగా తెలంగాణ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్ది తెలంగాణ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దాల్సిందిగా వీసీ రవీందర్‌గుప్తాను ఆయన ఈ సందర్భంగా కోరారు.

## పిల్లలకు కొవిడ్ వ్యాక్సిన్లు ఇవ్వాలని డబ్ల్యూహెచ్‌ఓ సూచించలేదు: కేంద్రం

న్యూఢిల్లీ, మే 27: ఇప్పటివరకు ఏ దేశంలోనూ బాలలకు కరోనా వ్యాక్సిన్లు ఇవ్వలేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. త్వరలోనే పిల్లలపైనా కొవిడ్ వ్యాక్సిన్ ట్రయల్స్ ప్రారంభిస్తామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. చిన్నారులకు కరోనా వ్యాక్సిన్ ఇవ్వాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) కూడా ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేసింది. పిల్లలకు కొవిడ్ టీకాలు ఇచ్చే అంశంపై అధ్యయనాలు జరుగుతున్నాయని వెల్లడించింది. ఇక దేశంలో విదేశీ టీకాలకు అనుమతించడం లేదని జరుగుతున్న ప్రచారంలో వాస్తవంలేదని పేర్కొంది. ఇతర దేశాల వ్యాక్సిన్ల విషయంలో సానుకూలంగా ఉన్నామని స్పష్టం చేసింది. అమెరికా, బ్రిటన్, జపాన్ ఆమోదించిన వ్యాక్సిన్లకు, డబ్ల్యూహెచ్‌ఓ సమ్మతి తెలిపిన వ్యాక్సిన్లకు భారత్ లో అనుమతి ఉందని వెల్లడించింది. వ్యాక్సిన్ల విషయంలో నిత్యం రాష్ట్రాలను సంప్రదిస్తున్నామని వివరించింది.

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రేపు ప్రధాని పర్యటన

న్యూఢిల్లీ, మే 27: ప్రధాని నరేంద్రమోదీ రేపు తుఫాన్ ప్రభావిత ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఆ రెండు రాష్ట్రాల్లో పరిస్థితిని సమీక్షించనున్నారు. రేపు ఢిల్లీలోని తన నివాసం నుంచి బయలుదేరనున్న ప్రధాని ముందుగా భువనేశ్వర్‌కు వెళ్లనున్నారు. అక్కడ ఉన్నతాధికారులతో సమావేశమై ఒడిశాలో తుఫాన్ పరిస్థితిపై సమీక్షించనున్నారు. అనంతరం తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన బాలాసోర్, భద్రక్, పర్బ మేదినిపూర్‌లలో ఆయన ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. ఆ తర్వాత పశ్చిమబెంగాల్‌కు వెళ్లనున్నారు. అక్కడ కూడా తుఫాన్ పరిస్థితిపై ఉన్నతాధికారులతో సమీక్ష చేయనున్నారు.

## సికింద్రాబాద్‌లో సీపీ అంజనీ కుమార్ పర్యటన

హైదరాబాద్ , మే 27: సికింద్రాబాద్ వెస్లీ కాలేజ్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు తనిఖీ కేంద్రాన్ని నగర పోలీసు కమిషనర్ అంజనీ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి తనిఖీ కేంద్రం వద్ద పోలీసులు పకడ్బందీగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతీ రోజు 8 వేలకు పైగా లాక్‌డౌన్ ఉల్లంఘన కేసులు నమోదు అవుతున్నాయని చెప్పారు. 5 నుంచి 6 వేల వరకు వాహనాలు సీజ్ అవుతున్నాయని పేర్కొన్నారు. ఈ -పాసులు దుర్వినియోగం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కరోనా ఆకృతి వేషధారణలో పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

## తెలంగాణలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు వాయిదా

హైదరాబాద్ , మే 27: రాష్ట్రంలో కరోనా మహమ్మారి ఉధృతి, లాక్‌డౌన్ నేపథ్యంలో తెలంగాణ ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 29వ తేదీ నుంచి జరగాల్సిన ఇంటర్ ప్రాక్టికల్స్‌ను వాయిదా వేస్తున్నట్లు బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ ప్రకటించారు. జూన్ మొదటి వారంలో పరిస్థితి సమీక్షించి నిర్ణయం తీసుకుంటామని గురువారం తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలకు నిర్వహించే 15 రోజుల ముందు షెడ్యూల్ ప్రకటిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని కోరారు. దీంతో ఈ నెల 29 నుంచి జూన్ 7వ తేదీ వరకు జరగాల్సిన ప్రాక్టికల్స్ నిలిచిపోయాయి. వాస్తవానికి ఏప్రిల్ 7 నుంచి పరీక్షలు జరుగాల్సి ఉండగా.. కరోనా కేసుల పెరుగుదల నేపథ్యంలో మే 29 ? జూన్ 7వ తేదీ వరకు వాయిదా వేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ప్రస్తుతం లాక్‌డౌన్ కొనసాగుతున్న నేపథ్యంలో మరోసారి ప్రాక్టికల్స్‌ను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది.

## నన్నెవరూ అరెస్ట్ చేయలేరు : రాందేవ్ బాబా

న్యూఢిల్లీ, మే 27: ఆధునిక వైద్యంపై రాందేవ్ బాబా చేసిన వ్యాఖ్యలపై ఐఎంఏ పరువునష్టం దావా వేయడం, ఆయనపై దేశద్రోహం కింద చర్యలు చేపట్టాలని డిమాండ్ చేయడంతో మాటల యుద్ధం ముదిరింది. యోగా గురు రాందేవ్ పై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ అరెస్ట్ రామ్ దేవ్ హ్యాష్ ట్యాగ్ తో నెటిజన్లు ట్విటర్ ట్రెండింగ్ కు పూనుకోవడంపై రాందేవ్ స్పందించారు. వారు ఏం చేసుకున్నా వారి తండ్రులు దిగొచ్చినా బాబా రాందేవ్ ను అరెస్ట్ చేయలేరని వ్యాఖ్యానించారు. అల్లోపతి, అల్లోపతి వైద్యంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన రాందేవ్ పై దేశ ద్రోహం కింద కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ బుధవారం ఐఎంఏ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసింది. కొవిడ్-19 వ్యాక్సినేషన్ పై ఆయన సాగిస్తున్న దుష్ప్రచారాన్ని నిలిపివేయాలని కోరింది.

వ్యాక్సిన్ రెండు డోసులు తీసుకున్నా పదివేల మంది వైద్యులు మరణించారని ఆయన అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఐఎంఏ మండిపడింది. కాగా తాను ఆధునిక వైద్య శాస్త్రం, అల్లోపతిని వ్యతిరేకించనని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ కు రాసిన లేఖలో యోగ గురు వివరణ ఇచ్చారు. ప్రజల ప్రాణాలను కాపాడే విషయంలో కీలక సర్జరీలు చేపట్టి మానవాళికి సేవలందించడంలో అల్లోపతి మెరుగైన పురోగతి కనబరిచిందని తాము నమ్ముతున్నామన్నారు. వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న క్రమంలో వాట్సాప్ లో వచ్చిన మెసేజ్ ను తాను చదివివినిపించానని, తన వ్యాఖ్యలపై ఎవరైనా బాధపడిఉంటే విచారం వ్యక్తం చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

# యాస్ బీభత్సం: ఒడిశా సీఎం ఏరియల్ సర్వే

భువనేశ్వర్, మే 27: : ఒడిశాలో యాస్ తుఫాన్ బీభత్సం సృష్టిస్తున్నది. బుధవారం మధ్యాహ్నం తుఫాన్ తీరాన్ని తాకినప్పటి నుంచి అక్కడ కుండపోత వర్షం కురుస్తున్నది. దాంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. దాంతో ఇండ్లు నీట మునిగి కొన్ని లక్షల మంది నిరాశ్రయులయ్యారు.

రెస్క్యూ బృందాలు బాధితులు అందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. పలుచోట్ల సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి బాధితులకు ఆశ్రయం కల్పిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. హెలికాప్టర్లో తిరుగుతూ రాష్ట్రంలో వరద పరిస్థితిని పరీక్షించారు. అనంతరం తుఫాన్ వల్ల అధిక ప్రాణ నష్టం జరుగకుండా చూసుకోవాలని అధికారులను అదేశించారు. సహాయక శిబిరాల్లో బాధితులకు భోజనంతోపాటు వైద్య సదుపాయాలను కూడా సమకూర్చాలని ఆదేశాలు జారీ చేశారు.

# కరోనా కట్టడిలో అందరూ భాగస్వాములు కావాలి : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్ , మే 27: కరోనా మహమ్మారి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిలో రాజకీయాలకు అతీతంగా అందరు భాగస్వాములు కావాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విజ్ఞప్తి చేశారు. జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో గురువారం మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కృషితో కరోనా కేసులు రోజు రోజుకు తగ్గుతున్నాయని మంత్రి తెలిపారు.

కరోనా కరోనా బాధితులకు నిత్యావసర వస్తువులు, మాస్కులు, ఇతర సదుపాయాల కోసం ఎర్రబెల్లి దయాకర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో దాదాపు కోటి రూపాయలు గత సంవత్సరం వ్యయం చేశామన్నారు.

ప్రస్తుతం ఇప్పటి వరకు రూ.40 లక్షల ఇప్పటి వరకు నిత్యావసర వస్తువులు, మాస్కులు, డ్రైఫ్రూట్స్, భోజనాల పంపిణీ చేశామని మంత్రి తెలిపారు. కొవిడ్ బాధితుల కోసం ప్రభుత్వ దవాఖానల్లో కొవిడ్ బాధితుల అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.ఎవరు కూడా ఆందోళ చెందాల్సిన పనిలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు కొవిడ్ నిబంధనలు పాటించాలని మంత్రి పిలుపునిచ్చారు.

## చరిత్రలో నేటినిజం



# రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఇప్పటిదాకా 22 కోట్లకు పైగా టీకా డోసులు

హైదరాబాద్ , మే 27: కోవిడ్ మీద పోరులో భాగంగా భారత ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యాధి నిర్ధారణ పరీక్షలు, సోకినవారీ ఆచూకీ కనిపెట్టటం, తగిన చికిత్స అందించటం, వ్యాప్తి నివారణకు తగిన జాగ్రత్తలు పాటింపజేయటం, టీకాలివ్వటం అనే ఐదు అంశాల ప్రాధాన్యంలో భాగంగా టీకాల మీద ప్రత్యేక దృష్టిసారించింది. భారత ప్రభుత్వం దేశవ్యాప్త టీకాల కార్యక్రమానికి అండగా ఉండి రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు టీకా డోసులు ఉచితంగా అందిస్తూ వచ్చింది. అంతే కాకుండా ఉత్పత్తి, సరఫరాను పెంచటానికి అనేక చర్యలు తీసుకుంటోంది.

మూడో దశ టీకాల కార్యక్రమాన్ని మరింత సరళంగా, వేగంగా అమలు చేయటం మే 1న మొదలైంది. ఈ వ్యూహంలో భాగంగా ప్రతి నెలలో సెంట్రల్ డ్రగ్స్ లేబరేటరీ (సిడిఎల్) ఆమోదించిన ఉత్పత్తి సంస్థలలో తయారైన 50% టీకా మందును కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. రాష్ట్రాలు మిగిలిన 50% నుంచి కొనుగోలు చేసుకోవచ్చు. ప్రభుత్వం అందించే టీకామందు మునుపటిలాగానే రాష్ట్రాలకు ఉచితంగా పంపిణీ జరుగుతుంది.

భారత ప్రభుత్వం ఇప్పటిదాకా రాష్ట్రాలకు, కేంద్రపాలితప్రాంతాలకు 22 కోట్లకు పైగా (22,16,11,940) కోవిడ్ డోసులు ఉచితంగా అందజేసింది. ఇందులో రాష్ట్రాల వాడకం, వృధా కలిపి ఈ ఉదయం 8 గంటలవరకు అందిన సమాచారాన్ని బట్టి 20,17,59,768 డోసులు ఉన్నట్టు తెలుస్తోంది.

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల దగ్గర ఇంకా 1.84 కోట్లకు పైగా (1,84,90,522) టీకా డోసులు పంపిణీకి అందుబాటులో ఉన్నాయి. పైగా, మరో 11 లక్షలకు పైగా (11,42,630) టీకా డోసులు వచ్చే 3 రోజుల్లో కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు పంపబోతోంది

# రాష్ట్రాలకు ఇప్పటిదాకా 22 కోట్లకు పైగా టీకా డోసులు-ఇంకా 1.77 కోట్ల డోసులు

న్యూఢిల్లీ, మే 27: కోవిడ్ మీద పోరులో భాగంగా భారత ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యాధి నిర్ధారణ పరీక్షలు, సోకినవారీ ఆచూకీ కనిపెట్టటం, తగిన చికిత్స అందించటం, వ్యాప్తి నివారణకు తగిన జాగ్రత్తలు పాటింపజేయటం, టీకాలివ్వటం అనే ఐదు అంశాల ప్రాధాన్యంలో భాగంగా టీకాల మీద ప్రత్యేక దృష్టిసారించింది. భారత ప్రభుత్వం దేశవ్యాప్త టీకాల కార్యక్రమానికి అండగా ఉండి రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు టీకా డోసులు ఉచితంగా అందిస్తూ వచ్చింది. అంతే కాకుండా ఉత్పత్తి, సరఫరాను పెంచటానికి అనేక చర్యలు తీసుకుంటోంది.

మూడో దశ టీకాల కార్యక్రమాన్ని మరింత సరళంగా, వేగంగా అమలు చేయటం మే 1న మొదలైంది. ఈ వ్యూహంలో భాగంగా ప్రతి నెలలో సెంట్రల్ డ్రగ్స్ లేబరేటరీ ఆమోదించిన ఉత్పత్తి సంస్థలలో తయారైన 50% టీకా మందును కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. రాష్ట్రాలు మిగిలిన 50% నుంచి కొనుగోలు చేసుకోవచ్చు. ప్రభుత్వం అందించే టీకామందు మునుపటిలాగానే రాష్ట్రాలకు ఉచితంగా పంపిణీ జరుగుతుంది.

భారత ప్రభుత్వం ఇప్పటిదాకా రాష్ట్రాలకు, కేంద్రపాలితప్రాంతాలకు 22 కోట్లకు పైగా (22,00,59,880) కోవిడ్ డోసులు ఉచితంగా అందజేసింది. ఇందులో రాష్ట్రాల వాడకం, వృధా కలిపి ఈ ఉదయం 8 గంటలవరకు అందిన సమాచారాన్ని బట్టి 20,13,74,636 డోసులు ఉన్నట్టు తెలుస్తోంది.

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల దగ్గర ఇంకా 1.77 కోట్లకు పైగా (1,77,52,594) టీకా డోసులు పంపిణీకి అందుబాటులో ఉన్నాయి. పైగా, మరో లక్ష టీకా డోసులు వచ్చే 3 రోజుల్లో కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు పంపబోతోంది

# సూపర్ స్ప్రెడర్స్ టీకాలకు ఏర్పాట్లు

## -గ్రేటర్ వరంగల్ కమిషనర్ పమేలా సత్పతి

వరంగల్, మే 27: నగరంలో సూపర్ స్ప్రెడర్లకు టీకాలు వేసేందుకు గ్రేటర్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం కమిషనర్ పమేలా సత్పతి కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే సూపర్ స్ప్రెడర్స్‌కు వాక్సినేషన్ కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు గ్రేటర్‌లో ఐదు కేంద్రాలు గుర్తించినట్లు చెప్పారు. శంభునిపేటలోని ఆర్‌ఆర్ గార్డెన్, వరంగల్ కొత్తవాడలోని ఇన్నర్ వీల్ క్లబ్, హన్మకొండలోని విష్ణుప్రియ గార్డెన్, మడికొండలోని మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్, బీమారంలోని జీఎంఆర్ గార్డెన్‌లో సూపర్ స్ప్రెడర్స్‌కు టీకా సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొవిడ్ నిబంధనల మేరకు పక్కా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి సెంటర్ పరిధిలో 13 డివిజన్లకు సంబంధించిన సూపర్ స్ప్రెడర్స్‌కు టీకాలు వేసేలా ప్రణాళికలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సెంటర్‌కు ఒక పర్యవేక్షణ అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. ఆర్‌ఆర్ గార్డెన్ సెంటర్‌కు ఈఈ శ్రీనివాస్‌రావు, ఇన్నర్‌విల్ క్లబ్‌కు డిప్యూటీ కమిషనర్ జోనా, విష్ణుప్రియ గార్డెన్‌కు పన్నుల అధికారి శాంతికుమార్, మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌కు డిప్యూటీ కమిషనర్ రవీందర్ యాదవ్, జీఎంఆర్ గార్డెన్‌కు ఈఈ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, జవాన్లు, మెప్మా సిఓలు, ఆర్‌పీలతో బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

95,500 మంది గుర్తింపు

గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటి వరకు 95,500 మంది సూపర్ స్ప్రెడర్స్‌ను గుర్తించామని కమిషనర్ పమేలా సత్పతి తెలిపారు. ఇంకా సూపర్ స్ప్రెడర్స్ పరిధిలో వచ్చే వారిని గుర్తించాలని ఆమె అధికారులను ఆదేశించారు. రైతు బజార్, మాంసం, చికెన్, కూరగాయలు, పండ్లు, చేపల విక్రయదారులు, చిరు వ్యాపారులు, కిరాణా, వైన్స్, ఐరన్ అండ్ హార్డ్‌వేర్, క్షౌరశాలలో పని చేసే వారిని గుర్తించాలని చెపారు. ప్రతి రోజూ సెంటర్‌కు వెయ్యి మంది చొప్పున ఐదు వేల మందికి టీకాలు వేసేలా ప్రణాళికలు చేయాలన్నారు. సూపర్ స్ప్రెడర్స్‌కు తేదీ, సెంటర్ టోకెన్లు వివిధ రంగుల్లో అందజేయాలని అధికారులకు సూచించారు. టీకాలు తీసుకునే వారు సెంటర్‌కు టోకెన్‌తో పాటు ఆధార్ కార్డు తీసుకరావాలని అన్నారు. ఈ సమావేశంలో చీఫ్ ఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, కార్యదర్శి విజయలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ జోనా, రవీందర్ యాదవ్, పన్నుల అధికారి శాంతికుమార్, ఈఈలు శ్రీనివాస్‌రావు, ప్రవీణ్‌కుమార్, డీఈలు రవికుమార్, రవీందర్, సంజయ్, శానిటరీ సూపర్‌వైజర్లు, భాస్కర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 28, 29 తేదీల్లో సూపర్ స్ప్రెడర్స్‌కు వ్యాక్సినేషన్

## -నిజామబాద్, కామారెడ్డి కలెక్టర్ల వెల్లడి

ఇందూరు/కామారెడ్డి, మే 27 : ఈ నెల 28, 29 తేదీల్లో సూపర్ స్ప్రెడర్స్‌కు వ్యాక్సినేషన్ వేసేందుకు వారి జాబితాను సిద్ధం చేయాలని నిజామాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, కామారెడ్డి కలెక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం సంబంధిత అధికారులతో నిజామాబాద్ కలెక్టర్ సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. కామారెడ్డిలోని జనహిత భవన్‌లో కామారెడ్డి కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రేషన్‌షాప్ డీలర్లు, ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు, పెట్రోల్ బంకులు, ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్స్, అందులో పని సిబ్బంది, జర్నలిస్టులకు ఈనెల 28, 29 తేదీల్లో వ్యాక్సినేషన్ కోసం జాబితా సిద్ధం చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పౌరసరఫరాల అధికారులు, జిల్లా వ్యవసాయాధికారి, జిల్లా పౌర సంబంధాల అధికారి వారి పరిధిలోని అర్హుల జాబితాను మండలాల వారీగా సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. లబ్ధిదారుల సంఖ్య ఎక్కువ సంఖ్యలో ఉంటే మండలానికి రెండు వ్యాక్సినేషన్ కేంద్రాలు, తక్కువగా ఉంటే రెండు, మూడు మండలాలకు ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశించిన ప్రొఫార్మాలో లబ్ధిదారులు, వారి వ్యక్తిగత వివరాలను నమోదు చేయాలని అన్నారు. వ్యాక్సినేషన్ కేంద్రాల్లో వైద్యసిబ్బందిని నియమించి ప్రశాంతంగా, పూర్తిస్థాయిలో వ్యాక్సినేషన్ జరిగేలా చూడాలన్నారు. జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు వారికి సమాచార శాఖ ద్వారా జారీచేసిన అక్రిడిటేషన్ కార్డుతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్‌ను వ్యాక్సినేషన్ సమయంలో సమర్పించాలన్నారు. కామారెడ్డి జిల్లాలోని అన్ని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఏరియా దవాఖాన, దేవునిపల్లి, రాజీవ్‌నగర్ యూపీఎస్, కామారెడ్డి అర్బన్ హెల్త్ సెంటర్‌లో వ్యాక్సిన్ వేస్తారని తెలిపారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్లు సూచించారు. సెల్ కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు వెంకటేశ్వర్‌రావు, గోవింద్, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డిలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటమాధవరావు, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీపీఆర్వో కొండల్‌రావు, జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి, జిల్లా పౌర సంబంధాల అధికారి పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# 3,450 మందికి వ్యాక్సిన్..

ఈ నెల 28, 29వ తేదీల్లో కామారెడ్డి జిల్లాలో 3,450 సూపర్ స్ప్రెడర్స్‌కు కొవిడ్ వ్యాక్సిన్ వేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రేషన్ డీలర్లు, గ్యాస్ సరఫరా చేసే సిబ్బంది, డీలర్స్, ఫెర్టిలైజర్స్, పెట్రోల్ బంక్ సిబ్బంది, ఇన్‌పుట్ డీలర్లు, జర్నలిస్టులకు వ్యాక్సిన్ వేయనున్నట్లు వివరించారు.

# ప్రపంచ వైశాఖీ వేడుకల సందర్భంగా ప్రధానమంత్రి కీలక ప్రసంగం

హైదరాబాద్ , మే 27: బుద్ధ పూర్ణిమ నేపథ్యంలో "ప్రపంచ వైశాఖీ వేడుకల"ను పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృశ్య-శ్రవణ మాధ్యమం ద్వారా కీలక ప్రసంగం చేశారు. అత్యంత పూజనీయులైన 'మహాసంఘ' సభ్యులతోపాటు నేపాల్, శ్రీలంక దేశాల ప్రధాన మంత్రులు, కేంద్ర మంత్రిమండలి సభ్యులు శ్రీ ప్రహ్లాద్ సింగ్, శ్రీ కిరణ్ రిజిజు, అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య ప్రధాన కార్యదర్శి-గౌరవనీయ డాక్టర్ ధమ్మపియా తదితరులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగిస్తూ- ఇది బుద్ధభగవానుని జీవితం, ఆయన ప్రబోధించిన ఉన్నతాదర్శాలు, ప్రపంచోద్ధరణ కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వేడుకలు నిర్వహించే రోజని పేర్కొన్నారు. కోవిడ్-19పై మానవాళి పోరులో ముందువరుసన నిలిచిన యోధులకు నిరుటి వైశాఖీ పూర్ణిమ కార్యక్రమాలను అంకితం చేసినట్లు ఆయన గుర్తుచేశారు. నేడు ఏడాది గడచిన తర్వాత కూడా కోవిడ్-19 మహమ్మారి మనను విడిచిపెట్టలేదని, భారత్ సహా ప్రపంచంలోని అనేక దేశాలను రెండోదశ పట్టి పీడిస్తున్నదని పేర్కొన్నారు. జీవితకాలంలో ఒకసారి దాపురించే ఇలాంటి మహమ్మారి అనేకమంది ముంగిళ్లను కష్టాలు-కన్నీళ్లతో విషాదంలో ముంచెత్తిందని, ప్రతి దేశంలోనూ లెక్కకు మిక్కిలిగా ప్రజలపై ఈ దుష్ప్రభావం పడిందని ఆయన వ్యాఖ్యానించారు. మహమ్మారి సృష్టించిన ఆర్థిక దుష్ప్రభావం భారీస్థాయిలో ఉన్నందున కోవిడ్-19 తర్వాత భూగోళం మునుపటిలా ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. అయితే, గడచిన ఏడాది కాలంలో గమనించదగిన అనేక ఆశావహ అంశాలు కూడా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

ఆ మేరకు మహమ్మారిపై అవగాహన మెరుగుపడిందని, తద్వారా దానిపై పోరు వ్యూహం నేడు బలోపేతమైందని చెప్పారు. దీంతోపాటు మన చేతిలోగల ప్రధాన ఆయుధమైన టీకాలు నేడు ప్రజలకు ప్రాణరక్షణతోపాటు మహమ్మారిని తరిమికొట్టడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఏడాది వ్యవధిలో కోవిడ్-19కు టీకాల తయారీలో మన శాస్త్రవేత్తలు చేసిన కృషి ప్రశంసనీయమని, మానవాళి దీక్షాదక్షతల శక్తికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

బుద్ధదేవుని జీవితంలో ప్రధానమైన నాలుగు ప్రదేశాలు ప్రపంచ మానవాళి వేదనలను దూరం చేసేదిశగా ఆయనలో ప్రగాఢ వాంఛను రగిలించాయని ప్రధానమంత్రి చెప్పారు. ఆ మహనీయుని అడుగుజాడల్లో గత సంవత్సరం అనేక సంస్థలు, వ్యక్తులు మానవ వేదనను ఉపశమింప చేయడంలో శక్తివంచన లేకుండా తమవంతు పాత్రను పోషించాయని ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగాగల అనేక బౌద్ధ సంస్థలు, బౌద్ధ ధర్మాన్ని అనుసరించే వ్యక్తులు వైద్య పరికరాలు, ఔషధాలు తదితర సరంజాను ఎంతో ఉదారంగా అందజేశాయన్నారు. ఇవన్నీ బుద్ధ భగవానుని "భవతు సబ్బ మంగళం" (మానవాళికి సర్వశుభాలూ కలుగుగాక) అనే ప్రబోధానికి అనుగుణంగా చేపట్టిన చర్యలేనని ఆయన వ్యాఖ్యానించారు.

కోవిడ్-19పై పోరాడుతున్న నేపథ్యంలో మానవాళి ఎదుర్కొంటున్న వాతావరణ మార్పు వంటి ఇతర సవాళ్లను విస్మరించరాదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుత తరంతోపాటు నిర్లక్ష్యపూరిత జీవనశైలి భవిష్యత్తరాలకు ముప్పుగా పరిణమిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. పర్యవసానంగా భూగోళం తన రూపురేఖలు కోల్పోకుండా రక్షించే దిశగా దృఢ సంకల్పం పూనాలని పిలుపునిచ్చారు. బుద్ధ భగవానుని బోధనలలో ప్రకృతి మాతను గౌరవించడం అత్యంత ప్రధానాంశమని ఆయన గుర్తుచేశారు. ప్యారిస్ లక్ష్యాల సాధనకు చేరువలోగల కొన్ని పెద్ద ఆర్థిక వ్యవస్థలలో భారత్ కూడా ఒకటని ఆయన ప్రకటించారు. భారతదేశానికి సంబంధించి సుస్థిర జీవనమంటే సరైన పదజాలం మాత్రమే కాదని, సముచిత చర్యలు కూడా అని ఆయన స్పష్టీకరించారు.

బుద్ధ భగవానుని జీవితం మనకు 'శాంతి-సామరస్యం-సహజీవన' సూత్రాలను ప్రధానంగా బోధిస్తున్నదని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. కానీ, నేడు 'ద్వేషం, ఉగ్రవాదం, విచక్షణరహిత హింస'పై ఆధారపడిన శక్తులు నేటికీ మనుగడ సాగిస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. అటువంటి శక్తులకు ఉదార ప్రజాస్వామ్య సూత్రాలపై విశ్వాసం ఉండదని స్పష్టం చేశారు. కాబట్టి మానవత్వాన్ని విశ్వసించేవారంతా 'ఉగ్రవాదం... తీవ్రవాద భావజాలం'పై యుద్ధానికి ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు బుద్ధదేవుని బోధనలు, సామాజిక న్యాయానికి ఇస్తున్న ప్రాధాన్యం అంతర్జాతీయ శక్తిని సంఘటితం చేయగల ఉపకరణాలు కాగలవన్నారు.

బుద్ధ భగవానుని అమూల్య బోధనల ప్రకాశం సకల విశ్వానికీ వెలుగునివ్వగలదని ప్రధానమంత్రి అన్నారు. ఆయన ఆలోచనల నుంచి మనమంతా ఎప్పటికప్పుడు ఉపదేశం పొంది కరుణ, ప్రపంచ సంక్షేమం-బాధ్యతల మార్గంలో పయనించగలమన్నారు. ఈ సందర్భంగా "మనకు కనిపించేదానికి భిన్నంగా సత్యం-ప్రేమల తుది విజయంపై నమ్మకాన్ని పెంచుకోవడం ఎలాగో బుద్ధభగవానుడు మనకు నేర్పాడు" అన్న మహాత్మాగాంధీ వ్యాఖ్యలను ప్రధాని ఉటంకించారు. తదనుగుణంగా బుద్ధదేవుని ఆదర్శాలకు పునరంకితమవుతూ ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.

ఆపన్నులకు నిత్యం సేవలందించడంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి నిస్వార్థ సేవలందిస్తున్న ప్రథమ స్పందనదారులు, ముందువరుస ఆరోగ్య కార్యకర్తలు, వైద్యులు, నర్సులు, స్వచ్ఛంద కార్యకర్తలు తదితరులకు ప్రధానమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరోపకార సేవలలో కష్టనష్టాలకు గురైన... ఆప్తులను, సన్నిహితులను కోల్పోయినవారికి ఆయన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

# పళాస కోవిడ్ కేర్ సెంటర్‌కు ఆక్సిజన్ ఆన్ వీల్స్‌ను అందించిన భారతీయ నావికాదళం

అమరావతి, మే 27: శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ జె నివాస్ విజ్ఞప్తికి స్పందించి భారతీయ నావికాదళం పళాస కోవిడ్ కేర్ సెంటర్‌కు 25మే 21న ఆక్సిజన్ ఆన్ వీల్స్ ప్లాంట్‌ను అందచేసింది. ఈ ఆక్సిజన్ ఆన్ వీల్స్‌కు నావికాదళానికి చెందిన నౌకా నిర్మాణ స్థలం (నావల్ డాక్‌యార్డ్) రూపకల్పన చేసింది. దీనిని పళాస కోవిడ్ కేర్ సెంటర్‌లో పశుసంవర్ధక, డైరీ డెవలప్‌మెంట్ మత్స్యశాఖా మంత్రి సీదిరి అప్పలరాజు సబ్ కలెక్టర్ సూరజ్ గనోర్, నావికాదళ బృంద సమక్షంలో లాంఛనంగా ప్రారంభించారు. విశాఖపట్నానికి చెందిన నావల్ డాక్ యార్డ్ నుంచి వచ్చిన నిపుణుల బృందం పళాసలోని కోవిడ్ హెల్త్ కేర్ సెంటర్‌లో ఆక్సిజన్ పైప్‌లైన్ తో ఆక్సిజన్ ఆన్ వీల్స్‌ను అనుసంధానం చేశారు. ఆసుపత్రిలో చేరిన 12మంది వరకూ రోగులకు ఇది 24 గంటలూ ఆక్సిజన్‌ను అందిస్తుంది. ఈ ప్లాంట్ నిర్వహణలో ఆసుపత్రి సిబ్బందికి నిపుణుల బృందం శిక్షణను ఇచ్చింది.

ఆక్సిజన్ ఆన్ వీల్స్ నావల్ డాక్ యార్డ్ చేపట్టిన ప్రత్యేక చొరవ. మారుమూల ప్రాంతాలలో ఉన్న ఆసుపత్రులకు సేవలు అందించేందుకు పిఎన్ఎ ఆక్సిజన్ ప్లాంట్‌ను చలన వేదికతో (మొబైల్ ప్లాట్‌ఫాం) ఏకీకృతం చేశారు. దీనిని వైస్ అడ్మిరల్ ఎబి సింగ్, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-ఛీఫ్, ఇఎన్‌సి 20 మే 21న విశాఖపట్నంలో లాంఛనంగా ప్రారంభించారు.

# రూ.6 ట్రిలియన్లు దాటిన 'పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ' పరిధిలోని "నిర్వహణలోని ఆస్తులు"

న్యూఢిల్లీ, మే 27: 'జాతీయ పింఛను వ్యవస్థ' (ఎన్‌పీఎస్), 'అటల్ పెన్షన్ యోజన' (ఏపీవై) పరిధిలోని "నిర్వహణలోని ఆస్తులు" (ఏయూఎం) 13 ఏళ్ల తర్వాత రూ.6 లక్షల కోట్లు (రూ.6 ట్రిలియన్లు) దాటాయని 'పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ' (పీఎఫ్ఆర్‌డీఏ) ప్రకటించింది. ఏయూఎంలో చివరి రూ.లక్ష కోట్లు కేవలం 7 నెలల్లోనే వచ్చాయని వెల్లడించింది.

కొన్నేళ్లుగా 74.10 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 28.37 లక్షల మంది ప్రభుత్వేతర రంగ వ్యక్తులతో ఎన్‌పీఎస్ చందాదారుల్లో గణనీయమైన వృద్ధిని పీఎఫ్ఆర్‌డీఏ చూసింది. వీరితో కలిపి మొత్తం చందాదారుల సంఖ్య 4.28 కోట్లకు పెరిగింది.

"రూ.6 ట్రిలియన్ల ఏయూఎం మైలురాయిని చేరుకున్నందుకు సంతోషంగా ఉంది. ఏడు నెలల్లోపు, 2020 అక్టోబర్‌లో 5 ట్రిలియన్ల దగ్గరున్నాం. ఎన్‌పీఎస్, పీఎఫ్ఆర్‌డీఏ పట్ల చందాదారులకు ఉన్న నమ్మకానికి ప్రస్తుత ఘనతే నిదర్శనం. ఈ మహమ్మారి కాలంలో, పదవీ విరమణ ప్రణాళికలకు, ఆర్థిక భద్రతకు వ్యక్తులు ప్రాధాన్యమిస్తున్నారు" అని ఈ ఏడాది మే 21 నాటికి, ఎన్‌పీఎస్, ఏపీవై చందాదారుల సంఖ్య 4.28 కోట్లు చేరగా, ఏయూఎం రూ.603,667.02 కోట్లకు పెరిగింది.

పీఎఫ్ఆర్‌డీఏ గురించి:

పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పాటైన రాజ్యాంగబద్ధ సంస్థ 'పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ'. ఈ చట్ట పరిధిలోకి వచ్చే జాతీయ పింఛను వ్యవస్థ, పింఛను పథకాల నియంత్రణ, ప్రోత్సాహం, క్రమబద్ధ అభివృద్ధిని నిర్ధరించడం ఈ సంస్థ విధులు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం 2004 జనవరి 1వ తేదీ నుంచి ఎన్‌పీఎస్‌ను తీసుకొచ్చినా, తర్వాత దాదాపు రాష్ట్ర ప్రభుత్వాలు వాటి ఉద్యోగులను ఇందులో చేర్చాయి. స్వచ్ఛంద ప్రాతిపదికన భారతీయులందరికీ (నివాసులు/ప్రవాసులు/విదేశాల్లో ఉన్నవారు), తమ ఉద్యోగుల కోసం కార్పొరేట్ సంస్థలకు ఎన్‌పీఎస్ భరోసా లభిస్తుంది.

# ఖమ్మం ప్రధానాసుపత్రిలోని ఎంసీహెచ్‌లో కరోనా ప్రత్యేక వార్డు

**2 ఏళ్లలోపు వారి కోసం 40 బెడ్లు ఏర్పాటు**
**యావత్ తెలంగాణలోనే మొట్ట మొదటి కేంద్రం**
**ప్రారంభించిన రవాణాశాఖ మంత్రి అజయ్**

ఖమ్మం సిటీ, మే 27: కొవిడ్ సెకండ్ వేవ్ కల్లోలం సృష్టిస్తుప్పటికీ తెలంగాణ ప్రభుత్వం సహాయ సహకారాలతో యావత్ జిల్లా యంత్రాంగం ప్రత్యేక పర్యవేక్షణ కారణంగా మహమ్మారి ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతున్నది. తొందరలోనే థర్డ్ వేవ్ రాబోతున్నదని, అది చిన్నారులపై తీవ్ర ప్రభావం చూపనుందని దేశవిదేశాల వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి అజయ్‌కుమార్, ఖమ్మం కలెక్టర్ కర్ణన్ ముందస్తు రక్షణ చర్యలకు ఉపక్రమించారు.

జిల్లా కేంద్ర ప్రభుత్వ ప్రధాన వైద్యశాల ప్రాంగణంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)లో కేవలం చిన్నారుల కోసమే ప్రత్యేక కొవిడ్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన 12 ఏళ్లలోపు బిడ్డలకు కరోనా సోకితే లక్షణాల తీవ్రత ఆధారంగా అత్యవసర, సాధారణ వైద్య సేవలు అందించనున్నారు.

**170 మంది చిన్నారులకు కొవిడ్..**

కొవిడ్ వ్యాప్తికి ఆదిలోనే అడ్డుకట్ట వేయాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే ఆధారంగా ఖమ్మం జిల్లాలో 12 ఏళ్లలోపు ఉన్న 170 మంది కరోనా బాధిత చిన్నారులను జిల్లా వైద్యారోగ్యశాఖ గుర్తించింది. వారిలోని కొందరిని లక్షణాల తీవ్రత ఆధారంగా ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలకు తరలించింది. వారు కోలుకుంటున్నారు. కాగా ప్రస్తుత సెకండ్ వేవ్, ఇక ముందు వెంటాడనున్న థర్డ్ వేవ్ నుంచి పసి పిల్లలను కాపాడుకోవాలనే సదుద్దేశ్యంతో ఖమ్మం పెద్దాసుపత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ప్రత్యేక కొవిడ్ వార్డును ఏర్పాటు చేశారు. ఇది యావత్ తెలంగాణలోనే మొదటిది. మొత్తం 40 బెడ్లు కలిగిన వార్డులో అధునాతన వసతులను అందుబాటులో ఉంచారు.

**ప్రారంభించిన మంత్రి అజయ్..**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పసి బిడ్డలకు మెరుగైన రీతిలో కొవిడ్ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డును మంత్రి అజయ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. అనంతరం వార్డులోని బెడ్లు, ఇతర వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడే కాకుండా భవిష్యత్‌లోనూ ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పసి బిడ్డలను కంటికి రెప్పలా కాపాడుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని భరోసానిచ్చారు.

# జులాయిలకు పోలీసుల ఝులక్ .. ఐసోలేషన్ సెంటర్లకు తరలిస్తామని హెచ్చరిక

ఎద్దపల్లిమే 27: లాక్ డౌన్ సమయంలో నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై తిరుగుతున్న జులాయి లకు పెద్దపెల్లి పోలీసులు ఝులక్ ఇచ్చారు. గురువారం ఉదయం పది గంటల తర్వాత రోడ్లపైకి వచ్చిన యువకులను అదుపులోకి తీసుకొని కోవిడ్ ఐసోలేషన్ సెంటర్ కు తరలిస్తామని సుల్తానాబాద్ కోవిడ్ ఐసోలేషన్ సెంటర్ ఫ్లెక్సీ పొందుపరిచిన డీసీఎం వ్యాన్ లో ఎక్కించడం తో ఒక్కసారిగా హడలిపోయారు. ఈ సందర్భంగా పెద్దపల్లి డిసిపి రవీందర్ మాట్లాడుతూ కరోనా కట్టడి కోసం ప్రభుత్వం లాక్ డౌన్ అమలు చేస్తున్న కొంతమంది యువకులు రోడ్లపైకి తిరుగుతున్నారని వారిని మందలించా లని వినూత్న కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు ప్రదీప్ కుమార్ ఎస్సై లు రాజేష్, ఇసాక్ తో పాటు సిబ

# తెలంగాణ సరిహద్దులో మళ్లీ అదే లొల్లి

హైదరాబాద్ , మే 27: ఆంధ్రప్రదేశ్-తెలంగాణా సరిహద్దుల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణాలో ఇప్పటికే లాక్‌డౌన్ ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఉదయం 10 గంటల తరువాత ఆంక్షలను మరింత కఠినతరం చేస్తున్నారు. బోర్డర్ వద్ద పోలీసులు మరోసారి ఆంక్షలను కఠినతరం చేశారు. ఎపి నుంచి తెలంగాణలోకి వచ్చే వాహనాలకు ఈ-పాస్‌లు తప్పనిసరి చేశారు. లాక్‌డౌన్ సడలింపు సమయంలో ఈ-పాస్ ఉంటేనే వారిని రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ప్రైవేట్ వాహనాలను నిలిపివేశారు. ఈ పాస్ ఉంటేనే వాహనాలకు అనుమతి అనుమతిస్తున్నారు. దీంతో టోల్ ప్లాజా వద్ద ట్రావెల్స్ బస్సులు, కార్లు అనేకం నిలిచిపోయాయి. పెద్ద సంఖ్యలో వాహనాలు ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర, సరుకు, అంబులెన్స్ కు మాత్రమే పాస్‌లు లేకున్నా అనుమతిస్తున్నారు.

కాగా, గతంలో ఉదయం 6 నుండి 10 గంటల వరకు తెలంగాణాలోకి ప్రవేశం ఉండేది. కానీ గత నాలుగు రోజుల నుండి ఈ.పాస్ తప్పనిసరి చేయటంతో ప్రయాణికులు, వాహనదారులు అయోమయంలో పడ్డారు. గతంలో మాదిరిగానే అనుమతించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని వాహనదారులు కోరుతున్నారు.

# జూన్ చివరికి ఎల్డీ-10లో సైఫాన్ కాలువ, చెక్ డ్యాం పనులు పూర్తి: మంత్రి హరీశ్

సిద్దిపేట, మే 27: : జిల్లాలోని నంగునూరు మండలంలో కొనసాగుతున్న కాలువలు, చెక్‌డ్యాం నిర్మాణ పనులను మంత్రి హరీశ్ రావు పరిశీలించారు. నంగునూరు మండలంలోని ఖాతా గ్రామం ఎల్డీ-10లో సైఫాన్ కాలువ, చెక్‌డ్యాం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇరిగేషన్ ఏస్ఈ బస్వరాజ్, ఈఈ గోపాల కృష్ణ, డీఈ చంద్రశేఖర్, ఏఈ ఖాజాలతో కలిసి నిర్మాణ పనులను మంత్రి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రంగనాయక సాగర్ జలాశయం ఆర్ఏంసీ కుడి కాలువ ద్వారా వచ్చే నీరు, వాటి నీటి లభ్యతపై, ఎల్డీ-10 పనుల పురోగతిపై చర్చించారు.

**జూన్ చివరికి ఎల్డీ-10లో సైఫాన్ కాలువ, చెక్ డ్యాం పనులు పూర్తి: మంత్రి హరీశ్**

పెద్దవాగుపై ఖాతా గ్రామం వద్ద దాదాపు రూ. 10 కోట్ల రూపాయల వ్యయంతో చెక్‌డ్యాం, దర్గపల్లి గ్రామంలో సిద్దిపేట వాగుపై చెక్‌డ్యాం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభంకానున్న నేపథ్యంలో ఈ పనులను జూన్ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కాలువలు, చెరువులు, కుంటలు, వాగులు, వంకలన్నీ నిండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నంగునూరు మండలంలోని వాగు అవతలి గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజాప్రతినిధులకు సూచించారు.

# కష్టకాలంలో కమ్యూనిటీలకు అండగా ఏబీ ఇన్బెవ్

హైదరాబాద్ , మే 27: కమ్యూనిటీల పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ సంగారెడ్డిలో ఉన్న ఏబీ ఇన్బెవ్ ఇండియా క్రౌన్ అండ్ చార్మినార్ బ్రూవరీస్ కోవిడ్-19తో ప్రభావితమైన చుట్టు పక్కల కమ్యూనిటీలకు అవసరమైన నిత్యావసర సరుకులు అందించడం ద్వారా మద్దతునందించేందుకు ప్రతిజ్ఞ చేసింది. సంగారెడ్డి జిల్లాలోని 11 గ్రామాలకు (మల్లేపల్లి, గుంటపల్లి, గోపులారం, తెర్‌పోల్, గొల్లపల్లి, శివంపేట, చక్రియాల్, చోట్కూర్, ఫసల్‌వాడీ, లింగంపల్లి, వెండికోల్) చెందిన 2000 కుటుంబాలకు 15 కేజీల రేషన్ కిట్స్‌ను అందించారు. వీటిలో నాణ్యమైన బియ్యం, గోధుమ పిండి, నూనె, మసాలాలు, విభిన్న రకాల పప్పు దినుసులు, ఉప్పు, పంచదారతో పాటుగా శానిటైజర్లు, సబ్బులు ఉన్నాయి.

ఏబీ ఇన్బెవ్ ఇండియా ఇప్పుడు స్థానిక అధికారులు ,వైద్య అధికారులతో అతి సన్నిహితంగా పనిచేయడంతో పాటుగా తెలంగాణా రాష్ట్రంలోని సంగారెడ్డి వద్ద ప్రభావితమైన కమ్యూనిటీలకు మద్దతునందిస్తున్నారు. ఈ నెలారంభంలో, ప్రపంచంలో సుప్రసిద్ధ బ్రూవర్ 300కు పైగా ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, 8వేలకు పైగా అవసరమైన సహాయాన్ని అందించే కిట్స్‌ను కోవిడ్-19 ప్రభావిత కుటుంబాలకు అందించడంతో పాటుగా దేశ వ్యాప్తంగా 50కు పైగా గ్రామాలలో ఐదు లక్షల మాస్కులు, 5వేలకు పైగా టెస్ట్ కిట్స్‌ను సైతం అందించింది.

"సంక్షోభ సమయంలో అవసరమైన సంఘీభావం అందించడంలోనూ మాకు ఘనమైన చరిత్ర ఉంది. మా కమ్యూనిటీలు, ప్రజల ఆరోగ్యం, భద్రత మాకు ఎల్లప్పుడూ తొలి ప్రాధాన్యతగా ఉంటూనే ఉంటుంది. సమాజం నుంచి తమ వ్యాపారం వేరు కాదని మేము అర్థం చేసుకున్నాం. కమ్యూనిటీలు, రాష్ట్ర ప్రభుత్వం, అధికారులకు మా నిరంతర మద్దతు కొనసాగించడం ద్వారా కోవిడ్?19తో జరుగుతున్న ఈ యుద్ధంలో విజయవంతమవుతామనే నమ్మకంతో ఉన్నాం. కలిసికట్టుగా మనం ఏదైనా సాధించగలం" అని ఏబీ ఇన్బెవ్ కార్పోరేట్ ఎఫైర్స్ ?సౌత్ ఆసియా, వైస్ ప్రెసిడెంట్ అనసూయ రే" అన్నారు.

# పరీక్షలు రాయకపోతే కరోనా రాదా: మంత్రి ఆదిమూలపు సురేష్

అమరావతి, మే 27: విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆరోగ్య భద్రత దృష్టిలో పెట్టుకుని సీఎం జగన్ పదో తరగతి పరీక్షలు వాయిదా వేయాలని ఆదేశించారని మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. కరోనా పరిస్థితి చక్కబడ్డాక తిరిగి పరీక్షల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని? త్వరలోనే పరీక్షల షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. ఉన్నత చదువుల కోసం టెన్త్, ఇంటర్ పరీక్షలు చాలా అవసరమని.. విద్యార్థులు నష్ట పోకుండా పరీక్షలు నిర్వహించాలని చూస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణకు కసరత్తు చేస్తోందన్నారు. సీబీఎస్ఈ పరీక్షలు నిర్వహించాలని కూడా తాము కోరినట్లు తెలిపారు. కొవిడ్ నిబంధనలు పాటిస్తూ పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. టెన్త్ విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా క్లాసులు ఉంటాయని.. తల్లిదండ్రులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని తెలిపారు. స్వీయ నియంత్రణతో కరోనా నుండి కాపాడుకో వచ్చన్నారు. ఉపాధ్యాయులు కూడా కరోనాకు ప్రాణాలు కోల్పోయారన్నారు. పరీక్షలు వాయిదా పడిన నేపథ్యంలో టీచర్లు కూడా స్కూల్స్‌కి రావాల్సిన అవసరం లేదని చెప్పారు. టీడీపీ మొండి వైఖరితో ముందుకు వెళుతుందని విమర్శించారు. వాస్తవాలను వాస్తవంగా చూడాల్సిన బాధ్యత ప్రతిపక్షాలకు ఉందన్నారు. లోకేష్ ఏం సాధించాలని పరీక్షలు రద్దు చేయాలని కోరుతున్నారని ప్రశ్నించారు. పరీక్షలు రాయకపోతే ఏమైనా కరోనా రాదని గ్యారెంటీ ఉందా అని మంత్రి సురేష్ నిలదీశారు.

# ప్రతికూల వాతావరణం, తుఫాను మధ్య తూర్పు రాష్ట్రాల నుంచి 969 ఎంటీల ఎల్ఎంఓతో బయలుదేరిన ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లు

న్యూఢిల్లీ, మే 27: ఉత్తరాఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, హర్యానా, తెలంగాణ, పంజాబ్, కేరళ, ఢిల్లీ ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్ మరియు అస్సాం రాష్ట్రాలకు ఆక్సిజన్ తరలించి సహాయం అందించిన ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లు

మహారాష్ట్రకు 614 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్, యూపీకి దాదాపు 3731 మెట్రిక్ టన్నులు, ఎంపీకి 633 మెట్రిక్ టన్నులు, ఢిల్లీకి 4910 మెట్రిక్ టన్నులు, హర్యానాకు 1911 మెట్రిక్ టన్నులు, రాజస్థాన్‌కు 98 మెట్రిక్ టన్నులు, కర్ణాటకకు1653 మెట్రిక్ టన్నులు, ఉత్తరాఖండ్‌కు 320 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 1158 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 929 మెట్రిక్ టన్నులు, పంజాబ్‌కు 225 మె

నాడు పోస్టు చేయడమైనది: 26 ఓంజ 2021 1:45ఖఓ ఎఎ ఖఎః ఊఎటవతీజీఎజీట

అన్ని అడ్డంకులను అధిగమించి కొత్త పరిష్కారాలను కనుగొనే భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ (ఎల్ఎంఓ) ను పంపిణీ చేయడం ద్వారా ఉపశమనం కలిగించే ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటివరకు భారత రైల్వే 1080 ట్యాంకర్లలో దాదాపు 17945 మెట్రిక్ టన్నుల ఎల్ఎంఓను దేశంలోని వివిధ రాష్ట్రాలకు రవాణా చేసింది.

వివిధ రాష్ట్రాలకు ఉపశమనం కలిగిస్తూ 272 ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లు ఇప్పటివరకు తమ ప్రయాణాన్ని పూర్తి చేశాయి.

నిన్న రాత్రి చివరి వరకు 12 ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లు 969 మెట్రిక్ టన్నుల ఎల్ఎమ్ఓతో తుఫాను ప్రభావానికి గురైన తూర్పు రాష్ట్రాల నుంచి ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్యవివిధ రాష్ట్రాలకు ఉపశమనం కలిగించడానికి బయలుదేరాయి. ఈ 12 రైళ్లల్లో మూడు రైళ్లు తమిళనాడు, నాలుగు రైళ్లు ఆంధ్రప్రదేశ్ కు, ఢిల్లీ ప్రాంతం, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, అస్సాం, కేరళకు ఒకో రైలుచేరనున్నాయి.

దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలకు 1000 మెట్రిక్ టన్నులకు పైగా ఎల్ఎంఓ పంపిణీ ఒక్కొక్కటి దాటింది. మొదటి ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ జార్ఖండ్ చేరుకుంది. రైల్వేల నుండి ఆక్సిజన్ పొందిన 15 వ రాష్ట్రంగా జార్ఖండ్ నిలిచింది.

అభ్యర్థించే రాష్ట్రాలకు సాధ్యమైనంత తక్కువ సమయంలో సాధ్యమైనంత ఎల్ఎంఓను అందించడానికి భారత రైల్వే ప్రయత్నిస్తోంది.

ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఆక్సిజన్ ఉత్తరాఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, హర్యానా, తెలంగాణ, పంజాబ్, కేరళ, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్, అస్సాం 13 రాష్ట్రాలకు సరఫరా అయ్యింది.

ఈ ప్రకటన వెలువడే సమయానికి మహారాష్ట్రకు 614 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్, యూపీకి దాదాపు 3731 మెట్రిక్ టన్నులు, ఎంపీకి 633 మెట్రిక్ టన్నులు, ఢిల్లీకి 4910 మెట్రిక్ టన్నులు, హర్యానాకు 1911 మెట్రిక్ టన్నులు, రాజస్థాన్‌కు 98 మెట్రిక్ టన్నులు, కర్ణాటకకు1653 మెట్రిక్ టన్నులు, ఉత్తరాఖండ్‌కు 320 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 1158 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 929 మెట్రిక్ టన్నులు, పంజాబ్‌కు 225 మెట్రిక్ టన్నులు, కేరళకు 246 మెట్రిక్ టన్నులు, తెలంగాణకు 1312 మెట్రిక్ టన్నులు, జార్ఖండ్ కు 38, అస్సాంకు 160 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ సరఫరా అయ్యింది.

ఆక్సిజన్ సరఫరా చేయవలసి ఉన్న వేర్వేరు మార్గాలను రైల్వేలు సిద్ధంచేశాయి. రాష్ట్రాల నుంచి అభ్యర్థనలు అందిన వెంటనే రంగంలోకి దిగడానికి రైల్వేలు సిద్ధంగా ఉంటున్నాయి. ఎల్ఎంఓను తీసుకురావడానికి రాష్ట్రాలు భారత రైల్వేకు ట్యాంకర్లను అందిస్తాయి.

భారతీయ రైల్వే పశ్చిమంలోని హాపా, బరోడా, ముంద్రా మరియు తూర్పున రూర్కెలా, దుర్గాపూర్, టాటానగర్, అంగుల్ వంటి ప్రదేశాల నుంచి ఆక్సిజన్ ను సమగ్ర కార్యాచరణతో ఉత్తరాఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, హర్యానా, తెలంగాణ, పంజాబ్, కేరళ, ఢిల్లీ మరియు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు రవాణ చేస్తోంది.

ఆక్సిజన్ సాధ్యమైనంత వేగంగా గమ్యస్థానాలకు చేరుకునేలా చూసేందుకు ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్ రవాణా రైళ్లను నడపడంలో రైల్వే కొత్త ప్రమాణాలను, ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించింది. దూర ప్రాంతాలకు ప్రయాణిస్తున్న ఈ రైళు ఒకోసారి 55 కిలోమీటర్ల వేగంతో నడుస్తున్నాయి. సాధ్యమైనంత తక్కువ వ్యవధిలో ఆక్సిజన్ గమ్య స్థానానికి చేరుకునేలా చూడడానికి గ్రీన్ కారిడార్ ను ఏర్పాటు చేసిన రైల్వేశాఖ వివిధ జోన్ల మధ్య సమన్వయం సాధిస్తూ ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లను అత్యవసర ప్రాతిపదికన నడుపుతోంది . వివిధ విభాగాలపై సిబ్బంది మార్పుల కోసం సాంకేతిక స్టాప్‌లను 1 నిమిషానికి తగ్గించారు.

ఎలాంటి అంతరాయం లేకుండా ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లు తమ ప్రయాణాన్ని కొనసాగించడానికి రైల్వేలు తమ మార్గాలను సిద్ధం చేస్తూ ఇతర సరకుల రవాణాకు అంతరాయం లేకుండా చర్యలను అమలు చేస్తున్నాయి.

ఆక్సిజన్‌ను తరలించడం చాలా క్లిష్టమైన అంశం. ఈ గణాంకాలు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. మరికొన్ని ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్‌లు రాత్రి తరువాత వాటి ప్రయాణాలను ప్రారంభిస్తాయని భావిస్తున్నారు.

# పోలవరం నిర్మాణంలో మరో అద్భుతం- వరద నీరు మళ్లింపు మొదలు

అమరావతి, మే 27: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపడుతున్న పోలవరం ప్రాజెక్ట్ పనుల్లో మరో అద్భుతం ఆవిష్కృతం కానుంది. పోలవరం ప్రాజెక్టు పనుల్ని ఈ ఏడాది చివరి కల్లా ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని పట్టుదలగా ఉన్న ఏపీ ప్రభుత్వం.. ఈ వర్షాకాలంలో పనులకు అంతరాయం లేకుండా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గోదావరికి వచ్చే వరద నీటిని మళ్లించేందుకు పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేసింది. గతంలో వరద నీటి కారణంగా పనులకు ఆటంకం కలగడంతో ఈసారి అలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపడుతోంది. గోదావరి నదీ ప్రవాహ మళ్ళింపు పనులను మొదలుపెట్టింది నిర్మాణ సంస్థ. నదీ ప్రవాహాన్ని ఎడమవైపు నుండి కుడివైపుకు దాదాపు 6.5 కి.మీ నదీ ప్రవాహాన్ని మళ్ళిస్తున్నారు.

ఎగువ కాఫర్ డ్యాం నిర్మాణం పూర్తి స్థాయిలో సిద్ధం చేసింది నిర్మాణ సంస్థ. గోదావరి నదీ ప్రవాహాన్ని ఎడమవైపు నుంచి కుడివైపుకు అధికారులు మళ్లిస్తున్నారు. పోలవరం స్పిల్‌వే నుంచి ఈ వర్షాకాలంలో వరద నీరు మళ్లించేందుకు ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేశారు. అప్రోచ్ ఛానల్ నుంచి స్పిల్‌వే మీదుగా స్పిల్ ఛానల్ వరకూ వెళ్లి అక్కడి నుంచి మరలా పైలట్ ఛైనల్ నుంచి సహజ ప్రవాహంలో గోదావరి నది కలవబోతోంది. ఈ లెక్కన చూస్తే ఆరున్నర కిలోమీటర్ల మేర గోదావరి ప్రవాహాన్ని దారి మళ్లించబోతున్నారు. దీంతో ఈ సీజన్‌లో ప్రాజెక్టు వద్ద పనులకు ఎలాంటి ఆటంకం ఉండదు. ఈ ఏడాది 14 గేట్ల ద్వారా ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి గోదావరి నదీ ప్రవాహాన్ని తరలించనున్నారు.

ఈ ఏడాది చివరి నాటికి ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్ చకచగా పనులు పూర్తిచేస్తోంది. ఈ క్రమంలో పోలవరం ప్రాజెక్ట్‌లో 42.5 మీటర్ల ఎత్తులో కాపర్ డ్యామ్ నిర్మాణాన్ని ఇంజనీరింగ్ అధికారులు పూర్తి చేశారు. ఈ ఏడాది స్పిల్‌వే నుంచి 14 గేట్ల ద్వారా నీటి తరలింపునకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే స్పిల్ వే చానల్ పనులు పూర్తయ్యాయి.

ఈ సీజన్ నుంచే గోదావరి నీటిని పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. ముందుగా రివర్ స్లూయిజ్ గేట్లను ఎత్తి గోదావరి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. ఈ వర్షాకాలంలో వచ్చే వరద నీటిని స్పిల్‌వే రేడియల్ గేట్లను ఎత్తి ఉంచడం ద్వారా దిగువకు విడుదల చేస్తారు. ఇందుకోసం ఇప్పటికే 14 రేడియల్ గేట్లను పైకి ఎత్తి సిద్ధంగా ఉంచారు. త్వరలో మిగతా గేట్లను కూడా ఎత్తి నీటిని దిగువకు పంపుతారు. ప్రస్తుతం ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

# ఆకతాయిలను ఐసోలేషన్‌కు పంపించిన పోలీసులు

పెద్దపల్లి, మే 27: : జిల్లాలోని రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఎన్టీపీసీ, గోదావరిఖని, యైటింక్లైన్ కాలనీలలో పెద్దపల్లి డీసీపీ రవీందర్ ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహించారు. కరోనా నేపథ్యంలో ఇష్టానుసారంగా బయట తిరిగితే కేసులు తప్పవని పోలీసులు హెచ్చరించారు. కొవిడ్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరుగుతున్న ఆకతాయి యువకులను పోలీసులు ఐసోలేషన్‌కు పంపించారు.

ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ..కరోనా నుంచి ప్రజలను రక్షించడానికి పోలీసులు రోడ్లపై ఉంటూ నిరంతరం ప్రజల కోసం పని చేస్తున్నారు. కొంతమంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ అనవసరంగా రోడ్లపైకి వస్తున్నారు. గల్లీల్లో, రోడ్లపై ఆకతాయిలు ఎంత చెప్పినా వినకుండా తిరుగుతున్నారని ఆయన తెలిపారు.

వారిని సుల్తానాబాద్ ఐసోలేషన్ కి ప్రత్యేక వాహనంలో తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇకపై ప్రతి రోజు ఉదయం 10 గంటల తరువాత అనవసరంగా రోడ్లపై తిరిగితే వారిని ఐషోలేషన్ వ్యాన్లో సుల్తానాబాద్ కి పంపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐపీఎస్ అధికారి నికిత పంత్, గోదావరిఖని ఏసీపీ ఉమేందర్, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

# ఈ నెల 28, 29 తేదీల్లో సూపర్ స్ప్రెడర్స్‌కు వ్యాక్సినేషన్ కొరకు ప్రత్యేక డ్రైవ్..

**-జిల్లాలో 4636 మంది సూపర్ స్ప్రెడర్స్**
**-17 వ్యాక్సినేషన్ సెంటర్లు ఏర్పాటు.**

సంగారెడ్డి, మే27 (నేటినిజం ప్రతినిధి) జిల్లాలో సూపర్ స్ప్రెడర్స్ గా గుర్తించిన వారికి రేపటి నుండి రెండు రోజులపాటు వ్యాక్సినేషన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు.

జిల్లాలో 4636 మందిని సూపర్ స్ప్రెడర్స్ గా గుర్తించినట్లు తెలిపారు. సూపర్ స్ప్రెడర్స్ (వాహకులు) గా గుర్తించిన చౌక ధరల దుకాణాల డీలర్లు, హెల్పర్లు ఎల్పిజి డిస్ట్రిబ్యూటర్లు, వర్కర్లు పెట్రోల్ బంక్ వర్కర్లు ఎరువులు రసాయనాలు, విత్తన డీలర్ దుకాణాలలో పనిచేయుచున్న కార్మికులకు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, ఫోటోగ్రాఫర్లకు కోవిడ్-19 టీకా వేయడానికి జిల్లాలో 17 ప్రభుత్వ వ్యాక్సినేషన్ సెంటర్లను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

హత్నూర పీహెచ్ సి లో హత్నూర మండలం వారికి,జోగిపేట మున్సిపల్ ఆఫీసు ఆవరణలో అందోల్ మండలం వారికి, పుల్కల్ పి.హెచ్.సి. లో పుల్కల్, చౌటుకూర్ మండలాల వారికి, సదాశివపేట పాత ప్రభుత్వ ఆసుపత్రిలో సదాశివపేట, మునిపల్లి మండలాల వారికి టీకా వేస్తారన్నారు. మిర్జాపూర్ పి.హెచ్.సి. లో రాయికోడ్, రఘురాసంగం న్యాల్కల్ మండలాలు,వట్ పల్లి జెడ్ పి హెచ్ ఎస్ లో వట్ పల్లి మండలం వారికి,సిర్గాపూర్ సి.హెచ్.సి లో కల్హేర్, కంగ్టి, సిర్గాపూర్ మండలాల వారికి, మనూర్ పి హెచ్ సి లో మనూర్ ,నాగల్గిద్ద మండలాలు, నిజాంపేట్ పి.హెచ్.సి లో నారాయణఖేడ్ మండలం వారికి , కానుకుంట బస్తీ దవాఖాన లో అమీన్పూర్, ఆర్ సి పూర్ మండలాలు, గుమ్మడిదల పీహెచ్సీ లో గుమ్మడిదల, జిన్నారం మండలాల వారికి, పటాన్చెరు యు పీహెచ్సీలో పటాన్చెరు మండలం వారికి, కొండాపూర్ పీహెచ్సీలో కొండాపూర్ మండలం వారికి, పోతిరెడ్డి పల్లి జెడ్ పి హెచ్ ఎస్ లో కంది మండలం వారికి, సంగారెడ్డి పాత జైలు ఆవరణలో సంగారెడ్డి మండలం, దిగ్వాల్ పి హెచ్ సి లో కోహిర్ మండలం వారికిజహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో , మొగుడంపల్లి, జహీరాబాద్ మండలాల జర్నలిస్టులకు టీకా వేయుటకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

ఈనెల 28 మరియు 29 తేదీలలో ఆయా వాక్సినేషన్ కేంద్రాలన్నీ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తాయన్నారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ సాఫీగా కొనసాగేలా ఆయా అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. వ్యాక్సినేషన్ కొరకు వెళ్ళేవారు తప్పనిసరిగా తమ వెంట గుర్తింపు కార్డు తో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతి తీసుకెళ్లాలని సూచించారు.

జర్నలిస్టులు తప్పనిసరిగా తమ అక్రిడిటేషన్ కార్డు, ఆధార్ కార్డు ను తీసుకెళ్లాలని సూచించారు. కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా వ్యాక్సినేషన్ కొరకు మాస్కులు ధరించి వెళ్లాలని, అదేవిధంగా భౌతిక దూరం పాటించాలని కోరారు. ఇట్టి అవకాశాన్ని ఆయా సూపర్ స్ప్రెడ ర్స్ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# ఆనందయ్య మందుపై హైకోర్టులో విచారణ.. వచ్చే సోమవారానికి వాయిదా

అమరావతి, మే 27: కరోనా రెండో దశ కల్లోలం నేపథ్యంలో నెల్లూరు ఆనందయ్య మందుకు డిమాండ్ పెరుగుతోంది. ఆనందయ్య మందును ప్రభుత్వమే పంపిణీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు ఇవాళ విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఆనందయ్య మందుపై అధ్యయనం జరుగుతోందని, ఈనెల 29న రిపోర్టులు వస్తాయని ఏపీ ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. దీనిపై స్పందించిన హైకోర్టు.. రిపోర్టులు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వం, ప్రజలు మందు కావాలని ఎదురుచూస్తున్నారని, వీలైనంత త్వరగా రిపోర్టులు రావాలని హైకోర్టు తెలిపింది.

అయితే విచారణ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాదనలు వినిపించాయి. రాష్ట్ర ప్రభుత్వం అసలు ఆనందయ్య తన మందును ఆయుర్వేద కౌన్సిల్‌లో రిజిస్టర్ చేసుకోలేదని తెలిపింది. దీనిపై ఆనందయ్య తరపు న్యాయవాది అశ్వనీకుమార్ స్పందిస్తూ.. మందును ప్రభుత్వం గుర్తించాలని ఇప్పటికే పిటిషన్ వేశారని గుర్తుచేశారు. అటు కేంద్ర ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ అసలు ఆనందయ్య మందులో ఏం కలుపుతున్నారో తెలుసుకుని, దాని వల్ల ప్రజలకు ఇబ్బంది లేదంటే కేంద్ర ఆయుష్ శాఖ అనుమతి ఇస్తుందన్నారు. మరోవైపు ఆనందయ్య మందు పంపిణీ ఆపాలని లోకాయుక్త ఎలా ఆదేశాలు ఇస్తుందని పిటిషనర్ తరపు న్యాయవాది కృష్ణయ్య ప్రశ్నించారు. ఆనందయ్యతో ప్రైవేట్‌గా మందు తయారు చేయిస్తున్నారని మరో పిటిషనర్ న్యాయవాది బాలాజీ కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో హైకోర్టు విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

# నా కలం అక్షర సత్యం ఆధ్వర్యంలో పేదింటి ఆడపడుచు పెళ్లికి అండగా, పెళ్లికి పుస్తెమట్టెలు దాతల సహాయం

రాజన్న సిరిసిల్ల మే, 27(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మండలం బొల్లారం గ్రామానికి చెందిన తోకల నిఖిత అనే అమ్మాయి నిరుపేద కుటుంబం కావడంతో అమ్మాయి పెళ్లి విషయం నా కలం అక్షర సత్యం ఫేసుబుక్ సోషల్ మీడియా వ్యవస్థాపకుడి దృష్టికి తీసుకురావడంతో పుస్తె,మట్టెలు కానుకగా ఇవ్వడానికి ముందుకు వచ్చిన కథాలపూర్ మండలం పోసానిపేట్ గ్రామ సర్పంచ్ ఎం.జీ రెడ్డి పుస్తెలు,చీర,మేడిపెల్లి మండలం మన్నెగూడెం గ్రామానికి చెందిన కట్కం.సంజయ్ దుబాయ్ ఎన్నారై మట్టెలు అందించడానికి ముందుకు వచ్చారు. అలాగే వేములవాడ పట్టణానికి చెందిన నగుబోతు విష్ణు కుమార్ అమ్మయికి పట్టు చీర,ధారణ గంగమల్లయ్య2000రూ,,అందించారు. గురువారం రుద్రంగి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం వద్ద అమ్మాయి కి కుటుంబానికి నా కలం అక్షర సత్యం టీం సభ్యులు మర్రిపెల్లి విశాల్,మనోజ్,పుస్తె,మట్టెలు, అందించారు. టీం సభ్యులు మాట్లాడుతూపుస్తె,మట్టెలు,పట్టు చీర ఇవ్వడనికి ముందుకు వచ్చిన పోసానిపేట సర్పంచ్ ఎం.జీ రెడ్డి,మన్నెగూడెం గ్రామానికి చెందిన కట్కం.సంజయ్ కి,వేములవాడ పట్టణానికి చెందిన నగుబోతు విష్ణు కుమార్ కి అమ్మాయి కుటుంబం సభ్యులు,నా కలం టీం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నా కలం అక్షర సత్యం టీం సభ్యులు మ

# కరోనా ప్రళయ వేళ 'చేంజ్ మేనేజ్‌మెంట్'..!

మార్పు సహజ ప్రక్రియ. ప్రతి మార్పు తొలి దశలో ప్రతిఘటననే ఎదుర్కొంటుంది. మార్పును మనిషి సులభంగా స్వాగతించడం జరుగదు. కాలంతో పాటు మార్పు కూడా అనివార్యంగా జరుగుతూనే ఉంటుంది. మనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా మార్పులకు అనుగుణంగా మనిషి, సమాజం, వ్యవస్థలు మారాల్సిందే. కర్కష కరోనా మహమ్మారి రాకతో మన జీవనశైలిలో సమూల మార్పులు అనివార్యమైనాయి. మార్పును స్వాగతించక, అలక్ష్యం చేస్తే అనర్థాలు జరుగుతాయని, ప్రాణాలు కూడా పోవచ్చనే కఠిన వాస్తవం మనిషికి అవగతమైంది. 2020 ప్రారంభంలో ప్రవేశించిన కరోనా వైరస్, ప్రపంచ దేశాలతో పాటు ఇండియాను కూడా అతలాకుతలం చేసింది. అల తరువాత అల సునామీలా వ్యాపిస్తూ భారతదేశ పల్లెలకు కూడా వేగంగా విస్తరిస్తున్నది. నేడు కరోనా ఉధృతి తగ్గడంతో ప్రపంచ దేశాలు ఊపిరి పీల్చుకుంటున్న వేళ ఇండియా మాత్రమే మహమ్మారి భయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని శ్వాస కోసం తపనపడుతున్నది. ఆసుపత్రి పడకలు, వెంటిలేటర్లు, ఐసియూలు, టీకాలు, ముఖ్య ఔషధాలు, ఆక్సిజన్ సిలిండర్ల కొరతల భయంతోనే కోవిడ్-19 రోగులు ప్రాణాలొదిలే దుస్థితి వచ్చింది. కరోనా వ్యాప్తితో మన జీవనశైలి ఆసాంతం అనేక మార్పులకు లోనైంది. సామాన్యులకు తెలియని మాస్కులు, సానిటైజర్లు నేడు నిత్యావసరాల జాబితాలో చేరాయి. కరోనా రుద్దిన క్రమశిక్షణకు తలవంచి మాస్కుల వాడకం, సానిటైజర్ల వినియోగం, చేతులు శుభ్రపరుచుకోవడం, సామాజిక దూరాలు పాటించడం లాంటి నవ్య నాగరికతలను నేర్చికోక తప్పడం లేదు. వ్యక్తి నుంచి సమాజం వరకు అంతటా నిన్నటి ఆచారాలకు తిలోదకాలిచ్చి, నేటి అత్యవసర నియమాలను పాటించాల్సిన దుస్థితికి ప్రపంచ మానవాళి చేరింది. కోవిడ్-19 విధించిన నవ్య నాగరికతలను పాటించక నిర్లక్ష్యం చేసిన వారు కరోనా కాటుకు దగ్గరవుతున్నారు. వ్యక్తులు, పరిశ్రమలు, వ్యాపారాలు, విద్యాలయాలు, కార్యాలయాలు, కార్పొరేట్లు లాంటి అన్నీ కరోనా దెబ్బకు మార్పులను అర్థం చేసుకుంటూ, ముందడు వేస్తున్నారు.

ఒక వ్యక్తి, కుటుంబం, పరిశ్రమ లేదా వ్యవస్థ ఉన్నతికి చేపట్టే సకారాత్మక ఆధునిక/అత్యవసర మార్పుల ప్రక్రియలు, కావలసిన వనరులు, నవ్య టెక్నిక్‌లను వాడుతూ, సక్రమంగా అమలు చేసే పద్ధతులను 'చేంజ్ మేనేజ్‌మెంట్ (మార్పుల నిర్వహణ)'గా పిలుస్తారు. మార్పుల నిర్వహణలో ముఖ్య భాగాలుగా మార్పులు చేపట్టుటకు గల కారణాలు (రీజన్స్), రాబోయే ప్రమాదాలు/అవరోధాలు (రిస్కులు), అవసర వనరులు (రిసోర్సెస్), రాబోయే ఆదాయాలు (రిటర్న్స్) లాంటివి కూలంకషంగా పరిశీలించాల్సి ఉంటుంది. మార్పులకు మానవ వనరులను సిద్ధం చేయడం, ప్రణాళికలు వేయడం, అమలు పరచడం, ప్రగతి పునర్ సమీక్షలు చేసుకోవడం, ఫలితాల విశ్లేషణ దశలను అమలు పరచాలి. మార్పులు చేయాల్సిన సందర్భాలలో 'ఎందుకు', 'ఏమిటి' మరియు 'ఎలా' అనే ప్రశ్నలకు సంతృప్తికర సమాధానాలు సిద్ధంగా ఉంచుకోవాలి. కరోనా సంక్షోభంలోంచి బయట పడడానికి, జీవన చక్ర గమనానికి, వ్యవస్థ సుస్థిరతకు, అన్ని రంగాల ప్రగతికి, ప్రాణాలు నిలుపుకుంటూ జీవనయానం చేయడానికి కావలసిన మార్పులను అలవర్చుకొనుటలో మనిషి సిద్ధహస్తుడవుతున్నాడు. ప్రభుత్వాలు మరియు వైద్య నిపుణులు కరోనాను తట్టుకోవడానికి అనేక మార్పులతో కూడిన జీవన విధానాన్ని సూచిస్తున్నారు. ముక్కు, మూతులకు మాస్కులు కప్పుకోవడం, సామాజిక దూరాలు పాటించడం, సానిటైజర్లతో చేతులు రుద్దుకోవడం, సభలు/సమావేశాలు రద్దు చేసుకోవడం, వర్క్ ఫ్రమ్ హోమ్, జూమ్ మీటింగులు, ఆన్‌లైన్ వాణిజ్యాలు, ఆన్‌లైన్ తరగతులు, డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ పరీక్షలు లాంటివి నేడు అతి సామాన్యునికి కూడా అత్యవసరాలుగా మారాయి. కరోనా వేగంగా వ్యాప్తి చెందడంతో జీవన/వ్యవస్థల శైలిలో మార్పులు సత్వరమే చేసుకోవలసిన అగత్యం ఏర్పడింది. మహమ్మారి కమ్మిన మానవాళి క్రమశిక్షణలతో మార్పులను ఆహ్వానించి, దానికి అనుగుణంగా తన శైలిని మార్చుకోవలసి వస్తున్నది. కొద్ది రోజుల్లోనే ఒక మాస్కుకు బదులు రెండు మాస్కులు వాడాలనే మార్పు త్వరలోనే చూడగలిగాం. ధనిక కుటుంబాలు కూడా గృహ శుభ్రతలు మరియు బట్టలు ఉతకడానికి పని మనుషులను మానేసి, స్వతహాగా చేసుకోవడం చూస్తున్నాం. డ్రైవర్లను తొలిగించి, తామే డ్రైవింగ్ చేసుకుంటున్నారు. అన్ని వర్గాల జనులకు శ్రమ విలువ తెలిసింది. రాజుకు, పేదలకు ప్రాణ విలువ తెలిసింది. నేటి ఆచారం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం రేపు పాతబడుతూ అవుట్‌డేట్ అవుతున్నది.

మార్పులను ప్రవేశ పెట్టుటలో మానవ వనరుల ఆరోగ్య భద్రత, మార్పులకు అవసరమైన ఆన్‌లైన్ శిక్షణ, వనరుల కల్పన, ఉత్పత్తి కొనసాగింపు మరియు భవిష్యత్ మార్పుల అంచనా లాంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నేడు కార్పొరేట్ రంగాలు వర్క్ ఫ్రమ్ హోమ్ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేస్తూ, ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నాయి. విద్యాలయాల మూసివేత కారణంగా విద్యను ఆన్‌లైన్ వేదికలుగా బోధించడం జరుగుతున్నది. నిపుణుల పని తీరులో సమూల మార్పులు రావడం, వ్యవస్థలు గాడిలో పడడం వెంట వెంటనే జరిగాయి. కార్యాలయాల్లో విధుల నిర్వహణకు సామాజిక దూరాలు పాటించాల్సిన అగత్యం ఏర్పడింది. వ్యక్తుల మధ్య భౌతిక సమావేశాలకు బదులు ఆన్‌లైన్ సమావేశాలు అలవాటు అయ్యాయి. మార్పులకు అంగీకరించని వ్యవస్థలు పాతబడుతూ, ఉత్పత్తి తగ్గుతూ, నష్టాలను చవి చూడాల్సి వస్తుంది. కాలంతో పాటు మారితే నవ్య మానవుడుగా కొనియాడబడతారు. టైప్ మిషన్ వాడిన కాలం మాయమై పోయి డిజిటల్ ట్యాబుల కాలం వచ్చి పడింది. సైకిల్ ప్రయాణాన్ని విమానయానం మింగుతున్నది. పాఠశాలలు మాయమై ఆన్‌లైన్ క్లాసులు వెలిశాయి. భౌతిక సమావేశాలు పాతబడి జూమ్ మీటింగులు పుట్టుకొచ్చాయి. సెమినార్లు అంతరించి వెబినార్లు వెలిశాయి. స్మార్ట్ ఫోన్ సర్వ రోగ నివారిణి అయ్యింది. ఆన్‌లైన్‌లోనే వివాహాలు చూస్తూ అక్షింతలు వేస్తున్నాం. ఆన్‌లైన్‌లోనే వ్యాపారాలు, వైద్యాలు, విద్యలు, పరీక్షలు, బ్యాంకింగ్‌లు సగటు మనిషికి చేరువైనాయి. మార్పులను శాస్త్రీయంగా ప్రవేశ పెట్టని యెడల వ్యవస్థ కుప్పకూలుతూ, కోలుకోలేని నష్టాల్లో మునిగే ప్రమాదాలు కూడా లేక పోలేదు.

మార్చి-2020లో ప్రారంభమైన కరోనా వ్యాప్తిని కట్టడి చేస్తూ, ప్రాణాలు నిలుపుకోవడానికి మానవాళి తమ జీవన విధానాన్ని కొద్ది రోజుల్లోనే మార్చుకోవడం మనకు గుర్తుంది. ఈ మహమ్మారి ఎంత కాలం ఉంటుంది, ఎలా విజృంభిస్తుంది అన్న అంశాలను బట్టి మరి కొన్ని మార్పులు చేసుకోవలసి రావచ్చు. మంచి కోసమే అయితే ఏ మార్పు అయిన సులభంగా వ్యవస్థలో ఇముడుతుంది. రోజులతో పాటు మనిషి మారాల్సిందే. అవసరాలకో, ప్రాణాలు కాపాడుకోవడానికో అయితే మార్పులు తొందరగా సమాజంలో స్వీకరించబడతాయి. ప్రగతి చూపని మార్పు చరిత్రలో కలిసి పోతుంది. మార్పు మాత్రమే ఆధునిక అభివృద్ధికి ఇంధనం. పాతరాతి యుగం నుండి డిజిటల్ యుగం వరకు మానవాళి అత్యద్భుత మార్పులను చవి చూడగలిగింది. మార్పుతోనే మనిషి పురోగతి అని, కోవిడ్-19 కోరల్లోంచి తప్పించుకోవడానికి ప్రతి ఒక్కరు అత్యవసర మార్పులను అంగీకరించి, సత్వరమే అమలు పరిచి కరోనా మహమ్మారిని పొలిమేరలు దాటేదాక తరిమి కొడదాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# లాక్ డౌన్ కేసులు 11,746 : ఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్, మే 27: : ప్రభుత్వం విధించిన లాక్ డౌన్ నిబంధనలను పటిష్టంగా అమలు చేయడంలో జిల్లా పోలీసు సమర్థవంతంగా పని చేస్తున్నారని జిల్లా ఎస్పీ రావిరాల వేంకటేశ్వర్లు అన్నారు. ఈ నెల పన్నెండవ తేదీ నుంచి అమలవుతున్న లాక్ డౌన్ ప్రశాంతంగా జరగడంలో ప్రజలు చక్కగా సహకరిస్తున్నారని ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా చట్టాన్ని ధిక్కరించిన వ్యక్తులను గుర్తించి, ఇప్పటివరకు జిల్లాలో మొత్తం (11,746) కేసులు నమోదు చేశామని ఎస్పీ వివరాలను వెల్లడించారు.

వీటిలో 385 కేసులు దుకాణాల యజమానులపై కాగా, మాస్కులు ధరించని వారిపై 7,288 అనవసరంగా రోడ్లపై తిరిగే వాహనదారులపై 4,073 కేసులు నమోదయ్యాయని తెలిపారు. మానవాళి అత్యంత వివత్కర పరిస్థితుల్లో ఉన్న నేపథ్యంలో మనమంతా క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా ఉంటూ మహమ్మారిపై విజయం సాదిద్దామని ఎస్పీ పిలుపునిచ్చారు.

కరోనా సెకండ్ వేవ్‌లో యువతనే ఎక్కువగా బాధితులుగా ఉన్నారని సర్వేలు చెప్తున్నాయని, ఈ విషయాన్ని గుర్తించి కుటుంబ పెద్దలు తగు జాగ్రత్తలు తీసుకోవడం మరిచిపోవొద్దన్నారు.

మన ఆరోగ్యం, కుటుంబం, సమాజం మొత్తాన్ని కాపాడుకునే క్రమంలో ఎవరికివారు సామాజిక బాధ్యతతో నడుచుకోవాలని ఎస్పీ ప్రజలను కోరారు.

# కరోనా వేళ వెల్లివిరిసిన మానవత్వం..

అమరావతి, మే 27: కరోనా మహమ్మారి బంధాలను బంధుత్వాలను దూరం చేస్తోంది. సొంతవారిని కూడా దగ్గరకు రాకుండా భయపెడుతుంది. మృతదేహాలను చూసేందుకు కూడా భయపడేలా చేస్తుంది. బంధువులు ఎందరు ఉన్నా కొందరు కరోనా బాధితులు అనాథలుగా మిగిలిపోతున్నారు. ఎవరు దగ్గరికి రాకపోవడంతో మానవత్వం కలిగిన వారు అంత్యక్రియలు చేస్తున్నారు. ఇటువంటి ఘటనే శ్రీకాకుళం జిల్లాలో జరిగింది.

అనాధ, పేద, కోవిడ్ మృతదేహాల దహన సంస్కారాలలో రెడ్ క్రాస్ వాలంటీర్స్ ఆదర్శంగా నిలుస్తున్నారు. కోవిడ్ సమయంలో బంధువులు సైతం దహన సంస్కారాలకు ముందుకు రాని పరిస్థితి చూస్తున్నాం. అయితే తాము సైతం అంటూ ముందుకు వస్తూ సమాజ సేవ ముఖ్యం అని నిరూపిస్తున్నారు రెడ్ క్రాస్ వాలంటీర్లు. కోవిడ్ బారిన పడిన వాలంటీర్లు కూడా ఏ మాత్రం వెనుకంజ వేయకుండా సమాజ సేవలో ముందున్నారు. గురువారం శ్రీకాకుళం నగర పరిధిలో 70 సంవత్సరాల అనాధ వృద్దుడు మరణించాడు.

అనారోగ్యంతో బాధపడుతూ రెడ్ క్రాస్ సంస్థ రోజు అందించే భోజనంతో జీవనం సాగించేవాడు. అయితే, గురువారం వృద్దుడు మరణించడంతో కోవిడ్ రెస్పాన్స్ టీం మృత దేహాన్ని స్మశాన వాటికకు తరలించి దహన సంస్కారాలు నిర్వహించారు. అంతేకాదు ఫాజుల్ బేగ్ పేట, రెడ్డికవీధికి చెందిన 82 సంవత్సరాల వయస్సు గల సత్యవతమ్మ, బ్యాంకర్స్ కాలనీకి చెందిన అర్ .సరోజినమ్మ(70), రణస్థలం మండలం పిసిని గ్రామానికి చెందిన రెడ్డి, ఇలా పలువురి మృతదేహాలను కూడా రెడ్ క్రాస్ వాలంటీర్లు దహన సంస్కారాలు నిర్వహించారు.

# ఉపాధిహామీ అమలులో అగ్రభాగాన తెలంగాణ : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్ , మే 27: ఉపాధిహామీ అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటిస్థానంలో ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం క్రింద రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ అభివృద్ధి పనులను చేపట్టి 13 కోట్ల పనిదినాలను కల్పించేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. అందులో ఇప్పటికే 9 లక్షల 80 వేల పనిదినాలు కల్పించడం జరిగిందన్నారు. హైద్రాబాద్‌లోని మినిస్టర్ క్యాంపు కార్యాలయం నుండి గురువారం పంచాయతీరాజ్ కార్యదర్శి సంధీప్‌కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్‌రావులతో కలిసి రాష్ట్రంలోని జిల్లా అదనపు కలెక్టర్లు, జిల్లా పరిషత్ సీఈవోలు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులతో మంత్రి వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో పల్లెప్రగతి, వివిధ పథకాల అమలును సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ కష్టకాలంలో కరోనా విస్తరించి ఉన్నా ఎంతో కష్టపడి ఉపాధిహామీ పథకం కొనసాగిస్తూ ఎంతో మంది నిరుపేదలకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఉపాధి హామీ పథకం అమలుకు అహర్నిశలు కృషి చేస్తున్న అధికారులను, ఉద్యోగులను మంత్రి అభినంధించారు. కరోనా వ్యాప్తి వల్ల నగరాలు, పట్టణాల నుండి చాలామంది తమ స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారని, వారందరికి అవసరమైన జాబ్‌కార్డులు అందించి ఉపాధి కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన పంట కాలువలు, ఫీల్డ్ చానల్స్‌ల పూడికతీత, వర్షాకాలం ప్రారంభం కాకముందే పనులను పూర్తి చేయాలన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించబడుతున్న జ్వర సర్వేల్లో ఏయన్‌యం, ఆశా కార్యకర్తలతో పాటుగా పంచాయతీ సెక్రటరీలు చురుగ్గా పాల్గొనాలని మంత్రి కోరారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 12 వేల 766 చెత్తను వేరుచేసే షెడ్లు మంజూరు కాగా, ఇప్పటికే 12వేల 602 షెడ్ల పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. అందులో11,566 చెత్తను వేరుచేసే షెడ్లు వినియోగంలోకి వచ్చాయని, మిగతా షెడ్లు వినియోగంలోకి వెంటనే తీసుకురావాలని ఆయన డిఆర్‌డివోలను కోరారు. రాష్ట్రంలోని గ్రామాలలో 12 వేల 756 వైకుంఠ ధామాలు(స్మశాన వాటికలు) మంజూరు కాగా, అందులో 11 వేల 515 పూర్తి అయ్యాయని, 9 వేల 140 వినియోగంలోకి వచ్చాయని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న మిగతా వైకుంఠధామాల పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని మంత్రి కోరారు. హరితహరం కార్యక్రమంలో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో వర్షాకాలం ప్రారంభం కాగానే మొక్కలు నాటడానికి కావాల్సిన మొక్కలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

# కరోనా మూలాలపై మూడు నెలల్లో తేల్చాలి.. ఇంటెలిజెన్స్‌కు బైడెన్ ఆదేశం

వాషింగ్టన్, మే 27: : కరోనా మూలాలపై మూడు నెలల్లో తేల్చాని అమెరికా ఇంటెలిజెన్స్ ఏజెన్సీని ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్ ఆదేశించారు. చైనాలో మొదట ఉద్భవించిన వైరస్ జంతు వనరు నుంచి ఉద్భవించిందా?.. ప్రయోగాశాల ప్రమాదం నుంచి వచ్చిందా? అనే విషయంపై 90 రోజుల్లో తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు. చైనాలోని వూహాన్ ల్యాబ్ నుంచే వైరస్ పుట్టుకు వచ్చిందని, జంతు వనరు నుంచి సోకిందని భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండగా.. ఈ మేరకు మరోసారి దర్యాప్తునకు ఆదేశించారు. దర్యాప్తుకు సహకరించాలని అమెరికా నేషనల్ ల్యాబోరేటరీస్‌కు బైడెన్ విజ్ఞప్తి చేశారు. వైరస్ మూలాలను కనుక్కునేందుకు చైనా సైతం కలిసిరావాలని కోరారు.

పూర్తి పారదర్శక, సాక్ష్య-ఆధారిత, సంబంధిత డేటా, సాక్ష్యాలకు అందించడానికి అంతేకాకుండా చైనాను ఒత్తిడి చేయడానికి యునైటెడ్ స్టేట్స్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న భాగస్వాములతో కలిసి పని చేస్తుందని గుర్తు చేశారు. అంతర్జాతీయ పరిశోధనలకు సహకరించడానికి చైనా ప్రభుత్వం పూర్తిగా నిరాకరించడంతో అసలు నిజాలు ఎప్పటికీ తెలియకపోవచ్చని అన్నారు. కొవిడ్ -19 మూలాలపై దర్యాప్తును ఇప్పటికీ అడ్డుకుంటూనే ఉందని ఆరోపించారు. దర్యాప్తు సంస్థలు సమాచార ప్రయత్నాలను రెట్టింపు చేయాలని, విశ్లేషణాత్మక వివరాలను సేకరించాలని సూచించారు. ఖచ్చితమైన నిర్ధారణకు 90 రోజుల్లో తిరిగి నివేదిక ఇవ్వాలని ఇంటిలిజెన్స్‌ను బైడెన్ ఆదేశించారు. వైరస్‌తో ఇప్పటికే 3.4 మిలియన్లకుపైగా ప్రజలు మృత్యువాతపడ్డారు.

# 12 సంవత్సరాలు పైబడిన వారికి మా వ్యాక్సిన్ సురక్షితం : ఫైజర్

న్యూఢిల్లీ, మే 27: భారత్‌లో వైరస్ ఉధృతికి కారణంగా చెబుతున్న వేరియంట్‌పై తమ వ్యాక్సిన్ అత్యంత సమర్థవంతంగా పని చేస్తుందని ఫైజర్ కంపెనీ తెలిపింది. ఇ.1.617.2 వేరియంట్‌కు వ్యతిరేకంగా వ్యాక్సిన్ 87.9 శాతం సమర్థవంతంగా పని చేసిందని పేర్కొంది. యూకేలో నిర్వహించిన అధ్యయనంలో 26శాతం మంది బ్రిటీష్ భారతీయులు పాల్గొన్నారని, అలాగే ఆసియాకు చెందిన పౌరులపై సైతం ట్రయల్స్ నిర్వహించినట్లు పేర్కొంది. 12 ఏళ్లు, అంతకు మించి వయస్సున్న వారి కోసం ఇచ్చేందుకు తమ వ్యాక్సిన్ సిద్ధమని, భారతీయులపై జరిపిన పరిశోధనల్లో మంచి ఫలితాలు వచ్చాయని పేర్కొంది.

ఈ మేరకు భారత్‌లో అత్యవసర వినియోగానికి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని ఫైజర్ విజ్ఞప్తి చేసింది. వ్యాక్సిన్‌ను రెండు నుంచి ఎనిమిది డిగ్రీల ఉష్ణోగ్రతల్లో నెల రోజుల వరకు నిల్వ చేయవచ్చని కూడా తెలిపింది. జూలై నుంచి అక్టోబర్ వరకు ఐదు కోట్ల డోసులను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఫైజర్ ఇది వరకే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, పరిహారంతో పాటు పలు నిబంధనలు సడలించాలని సడలించాలని కోరుతోంది. ఇప్పటికే ఈ విషయంలో పలుమార్లు కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో చర్చలు జరిపింది.

ఈ మేరకు ఇటీవల వివిధ దేశాల్లో ఫైజర్ సమర్థతకు సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డిఊా) ఇచ్చిన ధ్రువపత్రాలను కూడా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఇదిలా ఉండగా.. అమెరికాలోని మరో ఫార్మా దిగ్గజం మోడెర్నా ముంబైకి చెందిన సిప్లా కంపెనీతో కలిసి భారత్‌లో కొవిడ్ వ్యాక్సిన్ల తయారీని ప్రారంభించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. భారత్‌కు వ్యాక్సిన్ల సరఫరాకు ముందుకు వచ్చిన ఫైజర్, మోడెర్నా కంపెనీలు.. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వాలకు నేరుగా టీకాలు ఇచ్చేందుకు నిరాకరించిన విషయం తెలిసిందే. నేరుగా కేంద్ర ప్రభుత్వానికి టీకాలు అమ్ముతామని స్పష్టం చేశాయి.

# ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరిన రఘురామ

అమరావతి, మే 27: నరసాపురం ఎంపీ ఎంపీ రఘురామ కృష్ణంరాజు ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చేరారు. నిన్న ఆర్మీ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వెంటనే ఢిల్లీ వెళ్లిన రఘురామ.. ఎయిమ్స్ లో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కాలి గాయాలు తగ్గకపోవడం, నొప్పి ఎక్కువగా ఉండడంతోపాటు బీపీ నియంత్రణలోకి రాకపోవడంతో ఎయిమ్స్ లో చికిత్స తీసుకుంటున్నారు. మరోవైపు రఘురామ ఆరోగ్య పరిస్థితిపై కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ ఆరా తీశారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశించారు. రఘురామను హర్షవర్ధన్ ఫోన్‌లో పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కాగా, రఘురామకృష్ణరాజుకు సుప్రీం కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. కేసు గురించి మీడియాతోగానీ, సోషల్ మీడియాలో గానీ మాట్లాడవద్దని సుప్రీంకోర్టు షరతు విధించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించారనే ఆరోపణలపై రఘురామపై ఏపీ సీఐడీ అధికారులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి గుంటూరు జైలుకు తరలించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఆర్మీ ఆస్పత్రిలో రఘురామకు చికిత్స అందించారు. అనంతరం రఘురామరాజుకు బెయిల్ మంజూరు చేస్తూ మే 21న సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చింది.

# రైతులకు పనిముట్లను అందజేసిన మంత్రి అల్లోల

ఆదిలాబాద్, మే 27: : నిర్మల్ ఫిష్ మార్కెట్ వద్ద గల వ్యవసాయ కార్యాలయంలో గురువారం జాతీయ వ్యవసాయ ఆహార భద్రత పథకంలో భాగంగా రాయితీపై వ్యవసాయ పనిముట్లను దేవాదాయ శాఖ అంల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అందజేశారు. (50 % రాయితీపై బేలర్, గడ్డి కట్టే యంత్రం, రోటావేటర్లు, తైవాన్ పంపులు, పంప్ సెట్లు) ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు సంక్షేమం కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. మంత్రి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

# చిన్నారులకు ఏ దేశంలోనూ వ్యాక్సిన్లు ఇవ్వడం లేదు: నీతి ఆయోగ్

న్యూఢిల్లీ, మే 27: కరోనా టెన్షన్‌లో ఏది నిజం, ఏది అబద్ధమో తెలియకుండా పోతోంది. వైరస్ ధాటికి జనం పుకార్ల ఉచ్చులో పడిపోతున్నారు. వ్యాక్సినేషన్ ప్రక్రియపై ఉన్న అపోహలను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించింది. నీతి ఆయోగ్ సభ్యుడు, నెగ్‌వాక్ చైర్మన్ డాక్టర్ వినోద్ పౌల్ ఇవాళ ఓ ప్రకటన రిలీజ్ చేశారు. సోషల్ మీడియాలో షికారు చేస్తున్న పుకార్లపై క్లారిటీ ఇచ్చారు. ఏడు రకాల అపోహలకు ఆయన సమాధానం ఇచ్చారు.

చిన్న పిల్లల వ్యాక్సినేషన్ కోసం కేంద్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వస్తున్న పుకార్లకు ఆయన స్పందిస్తూ.. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశం కూడా చిన్న పిల్లలకు వ్యాక్సిన్లు ఇవ్వడం లేదన్నారు. చిన్నారులకు వ్యాక్సిన్ ఇవ్వాలన్న అంశంపై ఇప్పటి వరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఎటువంటి మార్గదర్శకాలను రిలీజ్ చేయలేదు.

కానీ చిన్నారుల్లో పనిచేసే రీతిలో వ్యాక్సిన్లు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. భారత్‌లో చిన్నారులపై వ్యాక్సిన్ ట్రయల్స్ త్వరలో జరగనున్నాయని, కానీ వాట్సాప్‌లో వస్తున్న సందేశాల ద్వారనో.. లేక రాజకీయవేత్తల ఆరోపణల ద్వారనో.. చిన్నారులకు వ్యాక్సినేషన్ జరగదని, డేటా ఆధారంగా శాస్త్రవేత్తలు తీసుకునే నిర్ణయం ఆధారంగా చిన్నారులకు వ్యాక్సినేషన్ ప్రక్రియ ఉంటుందని డాక్టర్ వినోద్ పౌల్ తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా లభ్యమవుతున్న వ్యాక్సిన్లకు భారత్ అనుమతి ఇవ్వడం లేదని వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. అమెరికాకు చెందిన ఎఫ్‌డీఏ, యురోపియన్ మెడికల్ ఏజెన్సీ, బ్రిటన్‌కు చెందిన ఎంహెచ్ఆర్ఏ, జపాన్‌కు చెందిన పీఎండీఏ, డబ్ల్యూహెచ్‌వో ఎమర్జెన్సీ జాబితాలో ఉన్న టీకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు డాక్టర్ వినోద్ పౌల్ చెప్పారు. రాష్ట్రాల బాధ్యతను కేంద్రం విస్మరించిందన్న ఆరోపణలను కొట్టిపారేస్తూ.. వ్యాక్సిన్ ఉత్పత్తిదారులకు నిధులను ఇస్తూ నేరుగా రాష్ట్రాలకే టీకాలు అందే విధంగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. విదేశీ టీకాలకు త్వరగా అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాలకు కావాల్సినన్ని వ్యాక్సిన్లు ఇవ్వడం లేదన్న ఆరోపణలపై స్పందిస్తూ.. ఒప్పందం ప్రకారమే పారదర్శకంగా ఆయా రాష్ట్రాలకు టీకాలు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

# భారత్‌లో అందుబాటులోకి రానున్న మరిన్ని వ్యాక్సిన్లు

న్యూఢిల్లీ, మే 27: దేశంలో త్వరలో మరో నాలుగు కొత్త కరోనా వ్యాక్సిన్లు అందుబాటులోకి వస్తాయని నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే పాల్ పేర్కొన్నారు. రోజుకు కోటి వ్యాక్సిన్ డోసులు అందించవచ్చని, మరికొన్ని వారాల్లో ఇది సాధ్యమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మూడు వారాల్లో రోజుకు 73 లక్షల వ్యాక్సిన్ డోసులు ఇచ్చేలా సన్నద్ధమవ్వాలని, ఈ దిశగా కార్యాచరణ రూపొందించుకోవాలని పేర్కొన్నారు. ఇక వ్యాక్సిన్ల ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు.

మొత్తం వ్యాక్సిన్ ఉత్పత్తిలో 25 శాతం రాష్ట్రాలు సేకరిస్తున్నాయని చెప్పారు. దేశీయంగా తయారయ్యే వ్యాక్సిన్లలో 50 శాతం కేంద్రం సేకరిస్తుండగా, ఇందులో 45 ఏళ్లకు పైబడిన వారికి ఇచ్చే వ్యాక్సిన్లను కేంద్రం ఉచితంగా రాష్ట్రాలకు అందిస్తోందన్నారు. మిగిలిన 50 శాతం వ్యాక్సిన్లను తయారీదారుల నుంచి రాష్ట్రాలు, ప్రైవేట్ ఆస్పత్రులు నేరుగా కొనుగోలు చేసే వెసులుబాటు ఉందన్నారు. రాష్ట్రాలు సేకరించిన వ్యాక్సిన్లలో అవి ప్రాధాన్యతా క్రమంలో వ్యాక్సినేషన్‌ను చేపడతాయని వీకే పాల్ పేర్కొన్నారు.

# అపత్కాలంలో ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం..!

**-34వ డివిజన్ కార్పొరేటర్ షాకిరా అంజుమ్-బర్కత్ అలీ ఔదార్యం**

రాజన్న సిరిసిల్